ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

శుక్రవారం 9 ఫిబ్రవరి 2024



అంగన్‌వాడీలపై కక్షసాధింపు

నిత్యం తనిఖీల పేరుతో ఒత్తిడికి గురిచేస్తున్న సూపర్ వైజర్లు

- కేంద్రాలకు వచ్చినప్పుడు, వెళ్లేప్పుడు సెల్ఫీలు తీసుకుని పంపాలంటూ సిబ్బందికి ఆదేశాలు
- ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు
- సమ్మె విరమించి విధుల్లో చేరినప్పటి నుంచీ ఇదే వరుస
- గతంలో ఎన్నడూ చూడలేదని వాపోతున్న సిబ్బంది



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):
తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సుమారు 45 రోజుల పాటు సమ్మె చేసిన అంగన్ వాడీ సిబ్బందికి ఇప్పుడు వేధింపులు మొదలయ్యాయి. సమ్మె విరమించి విధుల్లో చేరినప్పటి నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా సూపర్ వైజర్‌ల తనిఖీలు పెరిగాయి.

గతంలో రెండు, మూడు నెలలకు ఒకసారి తని ఖీలు చేసిన సూపర్ వైజర్లు ఇప్పుడు వారంలో రెండు, మూడుసార్లు వెళుతున్నారు. కేంద్రాలు పరిశుభ్రంగా ఉండడం లేదని, గర్భిణులు, పిల్లల సంఖ్య తక్కువగా ఉంటోందని, కారణమేమిటంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. గుడ్లు, పాలు సకాలంలో సరఫరా చేయాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరిస్తున్నారు. సూపర్ వైజర్లు, ఇతర ఉన్నతాధికారులు తరచూ తనిఖీలకు వస్తుండడం, కఠినంగా మాట్లాడుతుండడంతో సిబ్బంది కంగారుపడుతున్నారు. కొన్నిచోట్ల సమ్మె విషయాన్ని ప్రస్తావిస్తూ మరీ సూపర్‌వైజర్లు హెచ్చరికలు చేస్తున్నారు. సమ్మె విరమించాల్సిందిగా చెప్పినా పట్టించుకోరా?, ఉద్యోగాలు పోతే ఎలా బతుకుతారో ఆలోచించారా?...అంటూ అధికారులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు మాట పట్టకపోతే ఉద్యోగాలు ఎలా చేయగలుగుతారంటూ హెచ్చరిక ధోరణిలో మాట్లాడుతుండడంతో అంగన్వాడీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, ప్రతిరోజూ సిబ్బంది కేంద్రాలకు వచ్చినప్పుడు, వెళ్లేప్పుడు సెల్ఫీ తీసి పెట్టాల్సిందిగా సూపర్ వైజర్లు ఆదేశిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఫొటోలు పెట్టమనడంపై సిబ్బంది ఆవేదన వ్యక్తంచేశారు.

అలాగే, గతంలో ఎఫ్ఆర్ఎస్ అమలును అంగన్‌వాడీ సిబ్బంది వ్యతిరేకించిన తరువాత యాప్‌లో కేంద్రాల్లోని టాయిలెట్ ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సిందిగా ఉన్నతాధికారుల నుంచి ... మిగతా 6వ పేజీలో

ఆశల ఆందోళన



జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

డిమాండ్లు నెరవేర్చాలని, విజయవాడలో అరెస్టు చేసిన సహచరులను బేషరతుగా విడుదల చేయాలని కోరుతూ ఆశ కార్యకర్తలు నగరంలో నిరసన చేపట్టారు. సీఐటీయూ కార్యాలయం నుంచి జగదాంబ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. - వార్త I పేజీలో

కేజీహెచ్‌లో

90 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు తొలగింపు

- ప్రభుత్వ అనుమతి లేకుండా నియామకం
- ఆప్కోస్ విభాగానికి తప్పుడు సమాచారం
- ఇప్పుడు వారిని తొలగించాల్సిందిగా డీఎంఈ లేఖ

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):
కింగ్ జార్జ్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కోసం నియమించిన 90 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను తొలగించాల్సిందిగా ఉత్తర్వులు వచ్చినట్టు తెలిసింది. అయితే ఆ విషయం వారికి ఎలా చెప్పాలో తెలియక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నట్టు సమాచారం.



2013 నుంచి దశల వారీగా సుమారు 90 మందిని డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా అవుట్ సోర్సింగ్ (థర్డ్ పార్టీ ఏజెన్సీ) ద్వారా నియమించుకున్నారు. వీరికి ఆరోగ్యశ్రీ కార్యాల యం నుంచి జీతాలు చెల్లించేవారు. వైసీపీ అధికారం లోకి వచ్చిన తరువాత థర్డ్ పార్టీ ఏజెన్సీలు ఉండరా దన్న నిబంధనను తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో ఆ 90 మందిని నిబంధనల మేరకు వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కోస్) లో చేర్చాలి. కానీ, కేజీహెచ్ అధికారులు ప్రత్యేకంగా నోట్ ఫైల్ నడిపి ప్రభుత్వానికి విషయాన్ని తెలియజే యకుండా 90 మందిని ఆప్కోస్‌లో చేర్చేశారు. ఇందు కోసం ఒక్కో ఉద్యోగి నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే, అవుట్ సోర్సింగ్ విధానంలో ప్రస్తుతం జిల్లాల్లో ఎంతమంది పనిచేస్తున్నారనే సమాచారాన్ని ప్రభుత్వం సేకరిస్తోంది. కేజీహెచ్ నుంచి 90 మంది నిబంధనలకు విరుద్ధంగా చేరినట్టు గుర్తించిన అధికారులు...తక్షణమే వారిని తొలగించాలంటూ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు కేజీహెచ్ అధికారులకు ఆప్కోస్ ఎండీతోపాటు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) లేఖ రాశారు. కానీ, ఇక్కడి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ విషయం ఇప్పటివరకూ సదరు ఉద్యోగులకు తెలియలేదు. ఈ వ్యవహారం నిబంధనలకు విరుద్ధంగా ఆప్కోస్‌లో చేర్పించిన అధికారుల మెడకు చుట్టుకోనుంది. దీనిపై ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

డీఎస్సీ అభ్యర్థుల్లో ఆందోళన

టెట్, డీఎస్సీ వెంటవెంటనే నిర్వహించడంపై అభ్యంతరం

- ప్రభుత్వ తీరుపై మండిపాటు
- రెండింటి మధ్య కనీసం నెల రోజులు వ్యవధి ఉండాలని విజ్ఞప్తి
- వచ్చే నెల 14న టెట్ ఫలితాలు, 15 నుంచి డీఎస్సీ
- ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేస్తోందన్న ఉద్దేశంతోనే హడావుడి చేస్తున్నట్టుందని అభిప్రాయం
- న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్న నిరుద్యోగ జేఏసీ కన్వీనర్



విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):
ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం తగినంత వ్యవధి ఇవ్వకుండా టెట్, డీఎస్సీ నిర్వహించేందుకు సిద్ధం కావడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వేర్వేరు సిలబస్ అయినందున రెండు పరీక్షల మధ్య కాస్త సమయం ఉండాలని, కానీ ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేస్తోందన్న ఉద్దేశంతో వెంటవెంటనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోందని మండిపడుతున్నారు. టెట్‌లో ఉత్తీర్ణులైనవారే డీఎస్సీ రాసేందుకు అర్హులు. అందువల్ల టెట్‌కు కూడా ప్రాధాన్యం ఉంది. ఇంకా ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం వరకూ వెయిటేజీ ఉంటుంది. ఈ నేపథ్యంలో డీఎస్సీ రాసే అభ్యర్థులకు టెట్ అత్యంత కీలకం. అయితే టెట్, డీఎస్సీ పరీక్షల నిర్వహణ విషయంలో ప్రభుత్వం తొందరపాటుతో వ్యవహరిస్తోందని అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. టెట్‌కు హాజరుకానున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమైంది. ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే 27వ తేదీ నుంచి వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు రాత పరీక్ష నిర్వహిస్తారు. ఫలితాలు వచ్చే నెల 14న విడుదల చేస్తారు. సాధారణంగా టెట్ ఫలితాలు వెలువడిన తరువాతే డీఎస్సీ పరీక్షకు షెడ్యూల్ ఖరారు చేయాలి. రెండు పరీక్షల మధ్య కనీసం నెల నుంచి 45 రోజుల వ్యవధి ఉండాలి. కానీ వైసీపీ ప్రభుత్వం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల 14న టెట్ ఫలితాలు వెలువడిన మరుసటిరోజు అంటే 15వ తేదీ నుంచి డీఎస్సీ రాత పరీక్షల నిర్వహణ ప్రారంభమవుతుంది. దరఖాస్తుల స్వీకరణ ఈనెల 12న ప్రారంభమై 22తో ముగియనున్నది. టెట్, డీఎస్సీ పరీక్షల సిలబస్ వేర్వేరుగా ఉంటుంది. టెట్‌లో ఉత్తీర్ణత సాధించడంతోపాటు మంచి ... మిగతా 6వ పేజీలో



బీచ్ రోడ్డులో సిటీ పరేడ్ వీక్షణకు చేస్తున్న ఏర్పాట్లు

'మిలాన్'కు ఏర్పాట్లు

ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):
నగరంలో ఈ నెల 19వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్న నేవీ మిలాన్-2024కు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. మిత్రదేశాలతో కలిసి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ మిలాన్‌కు ఈసారి 60 దేశాలకు ఆహ్వానాలు పంపించారు. 50 దేశాల ప్రతినిధులు హాజరు కానున్నారు. ప్రారంభ ఉత్సవం ఈ నెల 21న నేవీ సముద్రిక ఆడిటోరియంలో నిర్వహిస్తారు. 22వ తేదీన ఆర్కే బీచ్‌లో ఇంటర్నేషనల్ సిటీ పెరేడ్ చేస్తారు. అన్ని దేశాల నేవీ ప్రతినిధులు వరుస క్రమంలో వచ్చి కనువిందు చేస్తారు. ఈ సందర్భంగా ఆయా దేశాల సంస్కృతిని తెలియజేసే నృత్యాలు ప్రదర్శిస్తారు. వీటిని వీక్షించడానికి బీచ్‌రోడ్డులో గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. మిలాన్ మొదటి దశలో హార్బర్ విన్యాసాలు, రెండో దశలో సముద్రంలో కార్యక్రమాలు ఉంటాయి.

రక్తమోడుతున్న రోడ్లు

- మళ్లీ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- గత వారం రోజుల్లో ఐదుగురు మృతి
- అతి వేగమే ప్రమాదాలకు కారణం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఈనెల ఆరో తేదీన ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్లి వస్తున్న ఇద్దరు యువకులు మధురవాడ సమీపంలోని బోరవానిపాలెం వద్ద లారీ కింద పడి మృతిచెందారు.

నాలుగో తేదీన ఎండాడ నుంచి గీతం కాలేజీ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన డంతో ఒకరు అక్కడికక్కడ మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

రెండున బీచ్‌రోడ్డులో అపరిమితంగా వెళుతున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో డ్రైవింగ్ చేస్తున్న యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు.

గత రెండేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు
2022	1,353	358
2023	1,307	321
2024	65	31

(ఫిబ్రవరి 6 వరకు)



సీతకొండ మలుపు వద్ద జరిగిన ప్రమాదం (ఫైల్ ఫొటో)

...నగరంలో మళ్లీ రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. గడచిన వారంలో చోటుచేసుకున్న ప్రమాదాలే అందుకు నిదర్శనం. కొంతమంది అపరిమిత వేగంతో వాహనాలను నడుపుతున్నారు. అనుకోని అవాంతరం ఎదురయ్యేసరికి వాహనాలను అదుపుచేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. నగర పరిధిలో ఏటా సుమారు 1,300 వరకూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను పోలీసులు బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. అక్కడ ప్రమాదాలు జరగడానికి కారణమైన అంశాలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బ్లాక్‌స్పాట్‌ల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్లు పెట్టడం, వాహనాల వేగ పరిమితి నిర్దేశిస్తూ బోర్డులు ఏర్పాటుచేయడం వంటివి చేస్తున్నారు. అలాగే ఒక కానిస్టేబుల్/హోంగార్డును నియమించి వాహనాల రాకపోకలను నియంత్రించే బాధ్యతలను అప్పగిస్తున్నారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాలను గత ఏడాది కొంతవరకూ పోలీసులు నియంత్రించగలిగారు. 2022లో 1,353 రోడ్డు ప్రమాదాలు జరిగి 358 మంది ప్రాణాలు కోల్పోతే, 2023లో రోడ్డు ప్రమాదాలను 1,307కే పరిమితం చేయడంతోపాటు ప్రమాదాల్లో మరణాల సంఖ్యను కూడా 321కి తగ్గించగలిగారు. అయితే ఈ ఏడాది ప్రారంభం నుంచి రోడ్డు ప్రమాదాలు పెరగడం ఆందోళనకు గురిచేస్తోంది. జనవరిలో 54 రోడ్డు ప్రమాదాలు జరిగితే..వాటిలో 25 మంది ప్రాణాలు కోల్పోగా, 48 మంది గాయపడ్డారు. ఫిబ్రవరి నెలలో వారం రోజుల్లోనే .. మిగతా 6వ పేజీలో

వెబ్ సిరీస్‌లో మాదిరిగానే...

తహసీల్దార్‌ను తలపై మోది చంపేశాడు

- క్రైమ్ కథాంశంతో వెబ్ సిరీస్ రూపొందించిన గంగారావు
- 'ది నైట్ చాప్టర్-1', 'ది నైట్ చాప్టర్-2'...
- ఒక దాంట్లో హీరోగా, మరొక దానిలో విలన్‌గా...
- హింసాత్మక దృశ్యాలు ఎక్కువగా ఉండడంతో సెన్సార్ అనుమతి నిరాకరణ
- పోలీసుల విచారణలో గుర్తింపు



వెబ్‌సిరీస్‌లో గంగారావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):
తహసీల్దార్ సనపల రమణయ్యను హత్య చేసిన మురారి సుబ్రహ్మణ్యం గంగారావు క్రైమ్‌ను ప్రధానాంశంగా తీసుకుని ఒక వెబ్ సిరీస్ రూపొందించాడు. ఆ సిరీస్‌కు రచయిత, దర్శకుడు, నిర్మాత, హీరో, విలనూ...అన్నీ అతనే. అయితే మితిమీరిన హింస ఉందని ప్రదర్శనకు సెన్సార్ అనుమతి నిరాకరించింది.

గంగారావు మంచి ఆహార్యం... ఆకట్టుకునే మాటతీరుతో ఏదో ఒకరియల్ ఎస్టేట్ కంపెనీలోనో, హోటల్‌లోనో మేనేజర్‌గా చేరి, తర్వాత అక్కడికి వచ్చే కస్టమర్లకు తాను యజమానినంటూ నమ్మబలికేవాడని పోలీసులు పేర్కొంటున్నారు. ఆ తర్వాత కాంట్రాక్టులు, వ్యాపారాల్లో భాగస్వామ్యం ఇప్పిస్తానని వారి నుంచి అందిన కాడికి గుంజేశాడని దర్యాప్తులో తేలింది. ఆ డబ్బుతోనే వెబ్ సిరీస్ నిర్మించారు. తనపేరు కలిసివచ్చేలా ఎంజీఆర్ పిక్చర్స్ పేరుతో 'ది నైట్ చాప్టర్-1', 'ది నైట్ చాప్టర్-2' నిర్మించాడు. దీనికి సంబంధించిన టీజర్లను కూడా కొన్నాళ్ల కిందట విడుదల చేశాడు. ఒక సిరీస్‌తో తానే హీరోగా, మరొక దానిలో విలన్‌గా నటించాడు. డ్రగ్స్ రవాణా, వినియోగం బ్యాక్‌డ్రాప్‌తో సాగే ఈ సిరీస్‌లో హీరోయిన్ సమాధులపై ఉంచిన శిలువతో కొందరిని ... మిగతా 6వ పేజీలో

వైసీపీ వైరస్‌ను తరిమికొట్టాలి

- పెందుర్తి నియోజకవర్గ జనసేన నేతలు, కార్యకర్తల సమావేశంలో నాగబాబు
- రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది
- సమస్యలన్నీ జనసేన, టీడీపీ ప్రభుత్వం పరిష్కరిస్తుందని హామీ



సుజాతానగర్‌లో జరిగిన జనసేన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

పెందుర్తి, ఫిబ్రవరి 8: రాష్ట్రం నుంచి వైసీపీ వైరస్‌ను తరిమికొట్టాలని, అందుకోసం అవసరమైతే తెలుగుదేశం, జనసేన నాయకులు త్యాగాలకు సిద్ధం కావాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగేంద్రబాబు పిలుపునిచ్చారు. జిల్లాలోని పెందుర్తి నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలతో గురువారం ఆయన సుజాతనగర్‌లోని ఇంద్రాణి ఫంక్షన్ హాలులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. పెందుర్తి నియోజవర్గ పరిధిలో పంచ గ్రామాల భూ సమస్య, తాడి గ్రామం తరలింపు, ముదపాక ల్యాండ్‌పూలింగ్ వివాదం వంటి సున్నితమైన సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరిస్తే ప్రజలకు మేలు జరిగి ఉండేదన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం తమకేంటి ప్రయోజనం అన్న ధోరణిలో పాలన సాగిస్తోందని విమర్శించారు. ఆ పార్టీ నేతలు కూడా ప్రజలు ఎలా పోతే తమకేంటి అన్న భావనతో ఉన్నవారేనన్నారు. జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వంలో ఇవన్నీ పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పోరాట యోధుడని వెన్నుచూపేతత్వం కాదన్నారు. అంతకుముందు పెందుర్తి నియోజకవర్గ సమస్యలను మాజీ ఎమ్మెల్యే ... మిగతా 6వ పేజీలో

ఉన్నత పాఠశాలలో తనిఖీలు



సమావేశంలో ఎంఈవో, పర్యవేక్షణాధికారులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 8: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో-1 రామారావు, జిల్లా పర్యవేక్షణాధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలకు ఆలస్యంగా వచ్చిన వారి వివరాలు సేకరించారు. అనంతరం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా పర్యవేక్షణాధికారులు ఎంవీ ధర్మారావు (తెలుగు), పి.హరి సుశీల (ఇంగ్లీష్), టి.రమణ (గణితం), రియాజ్ (సైన్స్)తో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి, పలు సూచనలు ఇచ్చారు. పాఠ్య, వార్షిక ప్రణాళికలు, బోధన, అభ్యసన సామగ్రి, టీచింగ్ డైరీలు, లీప్ పరీక్ష పత్రాలు, పిల్లల హాజరు నమోదు రిజిస్టర్లను పరిశీలించారు.

వన్‌టౌన్‌లో రహదారులు అధ్వానం

» గోతులతో నరకయాతన.. » నాలుగేళ్లుగా అభివృద్ధి శూన్యం

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 8: వన్‌టౌన్‌లోని పలు రహదారులు అధ్వానంగా మారాయి. ఏళ్లు గడుస్తున్నా పరిస్థితి మారకపోవడంతో నిత్యం స్థానికుల అవస్థలు పడుతున్నారు. టర్నర్ చౌల్ట్రీ నుంచి పాత పోస్టాఫీసు వరకు రోడ్డు విస్తరణపై గొప్పగా చెప్పుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి మెయిన్ రోడ్డు కనెక్టవిటీ రోడ్ల అధ్వాన పరిస్థితిని పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. మెయిన్ రోడ్డు ఆంజనేయ స్వామి గుడి నుంచి లోపలకు వెళ్లే చాకలివీధి, ఏనుగుల వీధి, వార్డుబాయస్ లైను పూర్తి గోతులమయంగా మారాయి. జీవీఎంసీ 30, 36 వార్డు బోర్డర్ రహదారి మార్గం ఇదే దుస్థితిని తలపిస్తోంది. పూర్ణామార్కెట్‌కు కనెక్టవిటీగా ఉన్న రోడ్డుపై నిత్యం కార్లు, ఆటోలు, లగేజీ వాహనాలు, ద్విచక్రవాహనాలు భారీగా ప్రయాణిస్తాయి. ఇటువైపు రోడ్లు పూర్తి గోతులమయంగా మారి ప్రయాణికులను భయపెడుతున్నాయి. చాకలివీధి, ఏనుగులవీధి, బాబ్జీ కొండ ప్రాంతీయులు నిత్యం ఈ మార్గంలో



చాకలివీధిలో నడిచేందుకు కూడా వీలులేని దుస్థితిలో రహదారి



30వ వార్డులోని ఓ రోడ్డు దుస్థితి..

ప్రయాణిస్తుంటారు. రోడ్లు అధ్వానంగా మారినా కార్పొరేటర్లు కొడూరు అప్పలరత్నం, (30వ వార్డు) మాసిపోగు మేరీజోన్స్ (36వ వార్డు) పట్టించుకోవడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ రెండు సార్లు ఇదే నియోజవకర్గం నుంచి విజయం సాధించినా కనీసం రహదారుల దుస్థితిని పట్టించుకున్న పాపాన పోలేదని ఈ ప్రాంతీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ నియోజకవర్గంలో అనేక వార్డుల పరిధిల్లో రోడ్ల దుస్థితి ఇదే విధంగా ఉన్నా దృష్టి సారించడం లేదంటున్నారు. కేజీహెచ్ డౌన్ నుంచి విజేత ఆస్పత్రి మెయిన్‌రోడ్డు కనెక్టవిటీ కుమ్మరవీధి, జెండా చెట్టువీధి అధ్వానంగా మారాయి. చాకలిపేట, ఏనుగుల వీధి నుంచి రోగులు కేజీహెచ్ ఓపీకి వెళ్లాలంటే గతుకుల రోడ్ల కారణంగా తీవ్ర అవస్థలు ఎదురవుతున్నాయి. ఆటోలు, ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తే మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు స్పందించి రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

నేడు నగరంలో యువశక్తి సదస్సు

» పల్సస్ సీఈఓ డాక్టర్ శ్రీనుబాబు గేదెల



మాట్లాడుతున్న శ్రీనుబాబు

సిరిపురం, ఫిబ్రవరి 8: మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకుందామనే నినాదంతో శుక్రవారం సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో యువశక్తి సదస్సు నిర్వహించనున్నట్టు పల్సస్ గ్రూప్ సీఈఓ డాక్టర్ శ్రీనుబాబు గేదెల తెలిపారు. ఈ మేరకు గురువారం హోటల్ మేఘలయాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ పంటను తామే మార్కెటింగ్ చేసుకునేందుకు, విద్యార్థులు తమ కాళ్లపై తామే నిలబడేందుకు అనుసరించాల్సిన విధానాలను ముగ్గురు నిపుణులు వివరిస్తారన్నారు. సదస్సుకు పెద్దసంఖ్యలో యువత హాజరుకానున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ తరహా సదస్సులు నిర్వహిస్తామన్నారు.

కేకే లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్‌రైలు

అరకులోయ, ఫిబ్రవరి 8: కొత్తవలస-కిరండోల్ (కేకే) రైల్వే లైనులో చిమిడిపల్లి స్టేషన్ సమీపంలో 70/28 కిలోమీటరు వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో చోటుచేసుకుంది. దీంతో కేకే లైనులో గూడ్స్ రైళ్ల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోగా, విశాఖపట్నం నుంచి కిరండోల్ వెళ్లే పాసింజరు రైలు ఆలస్యంగా నడిచింది. ఉదయం పది గంటలకు అరకులోయ రావాల్సిన పాసింజర్ సాయంత్రం నాలుగు గంటలకు వచ్చింది. రైల్వే ఉన్నతాధికారులు...సిబ్బందితో అక్కడకు చేరుకుని మధ్యాహ్నం మూడు గంటలకల్లా ట్రాక్ పునరుద్ధరణ పనులు పూర్తిచేశారు.

డీఎస్సీ అభ్యర్థుల్లో ఆందోళన

... 5వ పేజీ తరువాయి

మార్కులు వస్తేనే డీఎస్సీలో పోస్టు కొట్టేందుకు అవకాశం ఉంటుంది. అందువల్ల టెట్, డీఎస్సీ పరీక్ష మధ్య సమయం ఇవ్వకపోతే ఎలా?...అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 27వ తేదీ టెట్, వచ్చే నెల 15వ తేదీ నుంచి డీఎస్సీ నిర్వహించబోతున్నారని...ఇంత తక్కువ వ్యవధిలో రెండు పరీక్షలకు ఎలా సిద్ధం కాగలమని అడుగుతున్నారు. ఆరేళ్ల తరువాత నిర్వహించనున్న డీఎస్సీకి తీవ్రమైన పోటీ ఉండనున్నందున అభ్యర్థులు ప్రణాళికాయుతంగా ప్రిపేర్ కావాలంటే తగినంత సమయం ఉండాలని డైట్ రిటైర్డు లెక్చరర్ ప్రభాకరరావు అభిప్రాయపడ్డారు. రెండు పరీక్షల మధ్య తగినంత సమయం ఇవ్వకపోతే అభ్యరులు తీవ్ర ఒత్తిడికి గురవుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో టెట్, డీఎస్సీ పరీక్షల మధ్య తగినంత సమయం ఉండేలా ప్రభుత్వం, డీఎస్సీ షెడ్యూల్‌లో మార్పులు చేయాలని కోరుతూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ హేమంత్‌కుమార్ స్పష్టంచేశారు. ఇంకా డీఎస్సీలో పోస్టులు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిన జగన్

» టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం పీకల్లోతు అప్పుల్లో మునిగిపోయిందని టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆరోపించారు. గురువారం పార్టీకార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్థిక మంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ అని, రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 2019 వరకు అన్ని ప్రభుత్వాలు కలిపి రూ.2.87 లక్షల కోట్ల అప్పులు చేస్తే ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. రిజర్వుబ్యాంకు విధించిన ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి అప్పులు చేశారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర సుజలస్రవంతి ప్రాజెక్టుకు పైసా కేటాయించలేదని, ఐదేళ్లుగా ప్రాజెక్టును మూలపడేశారని ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్రలో వంశధార, తోటపల్లి, వెంగళరాయసాగర్ ప్రాజెక్టును గాలికొదిలేశారని, బడ్జెట్‌లో విశాఖ నగరానికి ఎటువంటి కేటాయింపులులేవని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ లోటు రూ.14వేల కోట్లుంటే ప్రస్తుతం అది రూ.55వేల కోట్లకు



సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

చేరిందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఐదేళ్లగా అన్ని శాఖలలో పనులుచేసిన కాంట్రాక్టర్లకు రూ.95 వేల కోట్లు బిల్లులు ఎందుకు పెండింగ్‌లో పెట్టిందో చెప్పాలని నిలదీశారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద నగరానికి కేంద్రం ఇచ్చిన నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల ముందు మెగా డీఎస్సీ తెస్తానని హామీ ఇచ్చిన జగన్, గద్దె దిగిపోయే ముందు చేసిన మినీ డీఎస్సీ ప్రకటన మోసం చేయడమేనన్నారు.

భూ చట్టం ప్రజల పాలిట భస్మాసుర హస్తం

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం ప్రజల పాలిట భస్మాసుర హస్తమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ చట్టం వల్ల నిజమైన భూమి హక్కు దారుడు బికారిగా మారాల్సిన పరిస్థితి ఎదురవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంకా వారసత్వంగా లేదా కష్టార్జితం కొనుగోలుచేసిన ప్రైవేటు భూములపై ప్రభుత్వ పెత్తనం ఏంటని ప్రశ్నిస్తున్నారు, ఈ చట్టం వల్ల రెవెన్యూ అధికారుల జోక్యంతో మొత్తం వ్యవస్థే చిన్నాభిన్నమై కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. భూముల తగదాలు కోర్టు పరిధి నుంచి తప్పించటం కుట్ర పూరితమని ఆరోపించారు. ఉత్తర నియోజకవర్గంలో మురళీనగర్, మాధవధార ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన మిగులు భూముల్లో ఇళ్లలేని పేదలకు ఇళ్లు నిర్మించాలనే అంశంపై పోరాటం చేయాలని నిర్ణయించామన్నారు. విలేకరుల సమావేశంలో సనపల వరప్రసాద్, శ్రీనివాస్, జగదీష్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై కక్ష సాధింపు

... 5వ పేజీ తరువాయి

ఆదేశాలు వచ్చాయి. కొన్నిరోజుల పాటు అప్‌లోడ్ చేసిన సిబ్బంది ఆ తరువాత పూర్తిగా మానేశారు. అయితే సమ్మె విరమించి విధుల్లో చేరిన తరువాత ప్రతిరోజూ టాయ్‌లెట్ల ఫొటోలు అప్‌లోడ్ చేయాలంటూ సిబ్బందికి ఆదేశాలు వచ్చాయి. అలాగే, సమయపాలన విషయంలోనూ కఠినంగా వ్యవహరిస్తున్నారు. కేంద్రాలకు పిల్లలను తీసుకువచ్చేందుకు కొన్నిసార్లు ఆయాలు బయటకు వెళుతుంటారు. కానీ, సూపర్‌వైజర్లు తనిఖీలకు వెళ్లినప్పుడు సిబ్బంది లేకపోతే తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీచేస్తున్నారు. ఉదయం తొమ్మిది నుంచి ఐదు గంటల వరకు తప్పనిసరిగా కేంద్రాల్లో ఉండాలని, లేకపోతే చర్యలు ఉంటాయంటూ హెచ్చరిస్తున్నారు. ఇన్నేళ్ల ఉద్యోగ జీవితంలో ఇటువంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదంటూ పలువురు సిబ్బంది వాపోతున్నారు. ఈ విషయం అసోసియేషన్ నాయకుల దృష్టికి తీసుకువెళుతున్నారు.

11న శ్రీనివాస కల్యాణ మహోత్సవం



కల్యాణోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, ఫిబ్రవరి 8: టీపీటీ కాలనీ ద్రావిడ సంక్షేమ సంఘం లలితా నూకల కామేశ్వరి కల్యాణ మండపంలో ఈనెల 11న శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఆధ్యాత్మికవేత్త వి.ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు పౌరగ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ శృతిలయ సాంస్కృతిక భక్తి సేవా సంస్థ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ నెల10న ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ద్వారం త్యాగరాజు సంగీత కచేరి, కోలాటం, కూచిపూడి నృత్యం, వేణుగానం, వీణావాదనం, నిర్వహిస్తామన్నారు. 11వ తేదీ ఆదివారం ఉదయం 9 నంచి సీతమ్మధార త్రిమూర్తిక వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి కల్యాణ వేదిక వరకు ఉత్సవ మూర్తుల తిరువీధి, సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సీహెచ్‌వీ సత్యనారాయణ, కొణతాల రాజు, ఎంఎస్ మాధవ్, పణిస్వామి, మస్తాన్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 8: గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో గురువారం ఓమ్నీ ఆర్కే ఆస్పత్రి, మంగళ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యం లో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నాల్గో అదనపు జడ్జి మహాదాస్ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

» ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు



సదస్సులో మాట్లాడుతున్న ఏడీసీపీ శ్రీనివాసరావు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 8: రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూని ట్లు, నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీసీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా ప్రయాణించాలన్నారు. విద్యార్థులతో కలిసి జ్ఞానాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు, టీషర్టులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్.నాగేశ్వరరావు, సి.బాలరాజు, ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ ఎస్ఐ ఎం.ప్రసన్న, డాక్టర్ మాణిక్యకుమారి, డాక్టర్ అరుణాదేవి, డాక్టర్ జె.నిర్మల పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను అమర్చుకోవాలి

సీతమ్మధార: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు తప్పనిసరిగా అమర్చుకోవాలని ఈస్ట్ సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆడమ్ పేర్కొన్నారు. అక్కయ్యపాలెంలో షాదీఖానాలో ఎస్ఐ కె.భాస్కరరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రతి అపార్టుమెంట్‌లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు డి.అప్పారావు, ఎ.సత్యారావు, ఎండీ అబీబ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడుతున్న రోడ్లు

... 5వ పేజీ తరువాయి

ఐ 11 ప్రమాదాలు జరగ్గా ఆరుగురు మృతిచెందారు. ఈ నెల ఆరో తేదీన పెదవాల్తేరులోని సీలాపు వీధికి చెందిన విజయనగరం పైడితల్లిఅమ్మవారి దర్శనానికి బైక్‌పై వెళ్లారు. దర్శనం తర్వాత నగరానికి తిరిగి వస్తుండగా మధురవాడ సమీపంలోని బోరవానిపాలెం వద్దకు వచ్చేసరికి రోడ్డుకు అడ్డంగా వచ్చిన గేదెను తప్పించబోయి అదుపుతప్పి కిందపడిపోయారు. అదే సమయంలో పక్క నుంచి వెళుతున్న గ్యాస్ లారీ ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయారు. ఈనెల నాలుగున ఎండాడ నుంచి గీతం కాలేజీ రోడ్డులో అతివేగంతో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీన్నాయి. ఆ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడ మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో మృత్యువుతోపోరాడుతున్నారు. అదేవిధంగా బీచ్‌రోడ్డులో అపరిమితం వేగంతో వెళుతున్న కారు సీతకొండ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో కారు నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు.

అతివేగమే ప్రమాదాలకు కారణం

నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అతి వేగమే కారణమని పోలీసులు చెబుతున్నారు. ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా, ఎన్నిసార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా కొంతమంది యువకులు దృక్పథం మారడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బీచ్‌రోడ్డు, శివారు ప్రాంతాల్లోని విశాలమైన రోడ్లు, జాతీయ రహదారి, బీఆర్‌టీఎస్ రహదారుల్లో వాహనాలను అపరిమిత వేగంతో నడుపుతున్నారని, అనుకోని అవరోధం హఠాత్తుగా ఎదురయ్యేసరికి వాహనాన్ని అదుపు చేయలేక ప్రమాదాల బారినపడుతున్నారని చెబుతున్నారు. ఎక్కడికక్కడ వాహనాల తనిఖీలు చేస్తున్నాసరే ఏదో మార్గంలో తప్పించుకుని వెళ్లిపోతున్నారంటున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తున్నాసరే పెద్దగా ఫలితం ఉండడం లేదని చెబుతున్నారు.

వెబ్ సిరీస్‌లో మాదిరిగానే...

... 5వ పేజీ తరువాయి

హత్య చేస్తుంది. మరొక సిరీస్‌లో హీరోగా నటించిన గంగారావు ఒక సన్నివేశంలో పురుషుడి మర్మాంగాలను కోసి చంపేస్తాడు. రెండింటిలో హింసాత్మక దృశ్యాలు ఎక్కువగా ఉండడంతో సెన్సార్ బోర్డు వాటి విడుదలకు అనుమతిని నిరాకరించింది. హైదరాబాద్‌లో ఒక వ్యక్తికి కాంట్రాక్టులు ఇప్పిస్తానని రూ.1.5 కోట్లు వసూలుచేసి వెబ్ సిరీస్‌కు ఖర్చుపెట్టేశాడు. మరోవైపు కాంట్రాక్టులు ఇప్పించకపోవడంతో డబ్బులు ఇచ్చిన వ్యక్తి...గంగారావుపై ఒత్తిడి తేవడం మొదలెట్టాడు. తాను నిర్మించిన సిరీస్ స్ట్రీమింగ్ అయిన వెంటనే డబ్బులు ఇచ్చేస్తానని గంగారావు అవతలి వ్యక్తికి చెప్పుకుంటూ వచ్చాడు. చివరకు డబ్బులు ఇవ్వకపోవడంతో కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గంగారావుపై కేసు నమోదైంది. ఇదిలావుండగా తాను నిర్మించిన వెబ్ సిరీస్‌లో హీరోయిన్ క్యారెక్టర్ ఒక సన్నివేశంలో ఒక యువకుడిని శిలువతో తలపై కొట్టి హత్య చేసినట్టుగానే గంగారావు కూడా తహసీల్దార్ రమణయ్యను రాత్రి పూట ఇనుపరాడ్డుతో తలపై మోది హత్య చేయడం గమనార్హం.

39వ వార్డులో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం



నాగబాబుకు జ్ఞాపిక అందిస్తున్న నాయకులు



పార్టీలో చేరిన వారితో ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషా కిరణ్

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 8: వైసీపీ ఓటమే లక్ష్యంగా జనసేన శ్రేణులను సన్నద్ధం చేస్తున్నట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు పేర్కొన్నారు. 39వ వార్డు లక్ష్మీటాకీస్ వద్ద పార్టీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ సాధిక్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. నియోజకవర్గంలో వైసీపీ ఓటమి ఖాయ మని జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు నాగబాబును ఆశీ ర్వదించారు. జనసేన ముఖ్యనాయకులకు పార్టీ కండువాలతో సత్కరించారు. సుందరపు సతీష్‌కుమార్, వసంతలక్ష్మి కందుల నాగరాజు, చీకటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

మర్రిపాలెం: గ్రేటర్ 53వ వార్డు మర్రిపాలెంలో జనసేన వార్డు అధ్య క్షుడు తాటిపాకల మాణిక్యాలరావు, మహిళా అధ్యక్షురాలు మొగసాల సుజన అధ్వర్యంలో గురువారం మహిళా సదస్సు నిర్వహించారు. అనంతరం 50మంది మహిళలు జనసేన పార్టీలో చేరగా, వారికి పార్టీ ఉత్తర కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ కండువాలు వేసి ఆహ్వానించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను బలపరచాలన్నారు. నీరుకొండ దివాకర్, సుంకర విజయ్, అప్పాజీ, తరుణ్, కిశోర్, మహేష్, లీనా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వైరస్‌ను తరిమికొట్టాలి

... 5వ పేజీ తరువాయి

పంచకర్ల రమేశ్‌బాబు అంశాల వారీగా నాగబాబుకు వివరించారు. పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల అని కార్యకర్తలు నినాదాలు చేయగా...పంచకర్ల వారిని వారించబోయారు. నాగబాబు జోక్యం చేసుకుని అభిమానాన్ని కట్టడి చేయొద్దని, అయితే సీటు ఎవరికిచ్చినా గెలుపు లక్ష్యం కావాలన్నారు. అనంతరం నాగబాబును పంచకర్ల, ఇతర నేతలు గజమాలతో సత్కరించారు. సమావేశంలో ఎలమంచిలి ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, సుందరపు సతీష్, అయిత సింహాచలం, పిళ్లా జగన్మోహనపాత్రుడు, ముదునూరి రాజసుధాకర్. పిన్నింటి వరలక్ష్మి, ఒబ్బిన శ్రీకాంత్, ముక్క గోపి, గొల్లవిల్లి శ్రీను, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీకి గంగారావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసులో నిందితుడు మురారి సుబ్రహ్మణ్యం గంగారావును ఐదు రోజులు పోలీస్ కస్టడీకి ఇచ్చేందుకు న్యాయస్థానం అనుమతించింది. ఈ కేసులో ఇంకా విచారణ జరపాల్సి ఉన్నందున రిమాండ్ ఖైదీగా కేంద్ర కారాగారంలో ఉన్న గంగారావును పది రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ పీఎం పాలెం పోలీసులు కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై గురువారం విచారణ జరిపిన కోర్టు ఈ నెల 12 వరకూ కస్టడీకి అనుమతించింది. అయితే అప్పటికే సాయంత్రం కావడంతో గంగారావును వెంటనే కస్టడీకి తీసుకుని విచారించడానికి పోలీసులకు వీలుపడలేదు. శుక్రవారం నుంచి నాలుగు రోజులుపాటు పోలీసులు విచారించనున్నారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విచారించి తిరిగి జైలుకు అప్పగించాల్సి ఉంటుంది.

అవగాహనతోనే పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ

కంచరపాలెం, ఫిబ్రవరి 8: అవగాహనతోనే పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించవచ్చునని కెమికల్ కళాశాల అల్యూమిని ఆఫ్ సేఫ్టీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ పీజే రావు పేర్కొన్నారు. కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రతా విభాగాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పరిశ్రమల్లో భద్రతపై అవగాహన, జనరల్ బాడీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ పీజే రావు మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగుల్లో భద్రతపై అవగాహన కల్పించేందుకు సభ్యులంతా కృషిచేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ సేఫ్టీ కోర్సుల ద్వారా ప్రమాదాల బారిన పడకుండా మేల్కొనవచ్చునన్నారు.

ముగిసిన తెలుగు సినిమా వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట, ఫిబ్రవరి 8: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా పౌరగ్రంథాలయంలో నిర్వహించిన తెలుగు సినిమా వేడుకల సభ గురువారంతో ముగిసింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను తెలిపే పాతచిత్రాలు అమూల్యమైనవని, రాష్ట్రంలో ఇటువంటి ఫెస్టివల్‌కు ప్రభుత్వ ఆదరణ కరువైందన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎన్ఏడీ పాల్, కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, హుస్సేన్, చాట్లా బాబూరావురెడ్డి, ఉషా, రవి, డాక్టర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో 'ఉక్కు' నాయకుల నిరసన ప్రదర్శన



ఢిల్లీలో నిరసన తెలుపుతున్న నాయకులు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 8: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు గురువారం న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు మంత్రి గోపీనారాయణ, చీకటి శ్రీనివాసరావు, గొందేశి ప్రభాకరరెడ్డి, శ్రీను, పెంటయ్య, పిట్టా రెడ్డి, ఉక్కు నిర్వాసిత సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వృథాగా పోతున్న తాగునీరు

తాగునీటి పైపు లైన్‌కు రంధ్రం

పెందుర్తి-రూరల్, ఫిబ్రవరి 8: జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని చీమలాపల్లి నుంచి ఎంఈఎస్ కాలనీకి వెళ్లే మార్గంలోని తాగునీటి పైపు లైన్‌కు భూగర్భంలో రంధ్రం పడడంతో తాగునీరు వృథాగా పోతోంది. రెండు రోజులుగా పైపు లైన్ ద్వారా నీటిని విడుదల చేసేటప్పుడు నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపు లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని వారు కోరుతున్నారు.

మూఢ నమ్మకాలను అరికట్టాలి

పెందుర్తి, ఫిబ్రవరి 8: మూఢ నమ్మకాలను అరికట్టే దిశగా ప్రజలను అప్రమత్తం చేసేందుకు గాను జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం రాష్ట్ర స్థాయి కళా సైన్స్ యాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జేవీవీ సభ్యులు మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసం లేని సమాజం కోసం ఏం నృత్య, నాటిక, పాటలు రూపంలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి మురళీధర్, శేషగిరిరావు, రమణ, రాధారాణి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

గోపాలపట్నం, ఫిబ్రవరి 8: కొత్తపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా గోపాలపట్నం, బాజీ జంక్షన్, నరసింహనగర్, ఇందిరానగర్, చంద్రనగర్, కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం, గణేశ్‌నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గుండె సమస్యలపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 8: పుట్టుకతో పిల్లల్లో వచ్చే గుండె సంబంధిత సమస్యలను సకాలంలో గుర్తిస్తే వారికి చికిత్స చేసి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయవచ్చని ప్రముఖ పీడియాట్రిక్ కార్డియాలజిస్టు డాక్టర్ ఆర్.శాంతిప్రియ అన్నారు. పుట్టుకతో వచ్చే గుండె లోపాల అంతర్జాతీయ వారోత్సవాల సందర్భంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన గుండె సమస్యల అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతు చిట్టి గుండెను కాపాడుకునేందుకు వాటి లోపాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. జన్యుపరమైన లోపాలు గుండె లోపాలలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైహెచ్ఏ నూతన కార్యవర్గం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 8: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఉక్కునగరం యూనిట్ సర్వసభ్య సమావేశం గురువారం స్టీల్‌ప్లాంట్‌లో జరిగింది. ఈ సందర్భంగా 2024-27వ సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ సభ్యుడు ఎం.సాయిరాంరాజు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారు. రాష్ట్ర శాఖ నుంచి పర్యవేక్షకులుగా కేవీ రాజు, ఎస్ఆర్‌సీ. మోహన్‌లు హాజరయ్యారు. నూతన అధ్యక్షునిగా ఆర్‌వీవీఎస్ జగపతిరాజు, ఉపాధ్యక్షులుగా భాస్కరరాజు, పి.శ్రీనివాసరావు, ఛైర్మన్‌గా వీఆర్‌కే రాజు, కోశాధికారిగా కె.సూర్యకుమార్ ఎన్నికయ్యారు.

పేకాటాడుతున్న ఏడుగురి అరెస్టు

పెందుర్తి, ఫిబ్రవరి 8: వేపగుంట సమీపంలోని బహిరంగ ప్రదేశంలో పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు సీఐ ఎల్.రామకృష్ణ గురువారం తెలిపారు. వీరి నుంచి రూ.41 వేల నగదుతో పాటు ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **ఈగెల్ :** జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శరత్, సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఈగెల్ :** మెలోడి, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం).
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక).
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** సంగం, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20, టమాటా 32, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 40, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 50, బీరకాయలు 46, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 22, క్యాబేజీ 18, క్యారెట్ 24, దొండకాయలు 40, బంగాళదుంపలు 22, అరటికాయ (పెద్దది) 4, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 80, బరబాటి 26, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 62, కీర దోస 28, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 32, కంద 58, దేముడుచిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	112
ఫారం ధర	132
విత్ స్కిన్	234
స్కిన్‌లెస్	244

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

నిరుద్యోగులను ముంచిన సీఎం జగన్

అది మెగా కాదు.. దగా డీఎస్సీ

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

గాజువాక, ఫిబ్రవరి 8: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి డీఎస్సీకి నోటిఫికేషన్‌ను విడుదల చేశారని, ఇది మెగా డీఎస్సీ కాదని.. దగా డీఎస్సీ అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం 'నిరుద్యోగులను ముంచిన జగన్-దగా డీఎస్సీ' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తామని చెప్పి ఇప్పటివరకు ఒక్కటి కూడా విడుదల చేయకుండా నిరుద్యోగులను ముఖ్యమంత్రి నిలువునా ముంచారని మండిపడ్డారు. అయితే ఇప్పుడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ గంధం శ్రీనివాస్, నాయకులు తమిరె శివప్రసాదరావు, పోతిన వెంకటేశ్వరరావు, బలగ బాలునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి

కూర్మన్నపాలెం: పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వడ్లపూడిలోని టీడీపీ కార్యాలయం జరిగిన బూత్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటు కీలకమని, అందువల్ల ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. టీడీపీ-జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మాట్లాడుతూ వైసీపీ పాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయి ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఆ పార్టీకి ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయరామరాజు, వర్రె రాంబాబు, డీవీ అప్పారావు, రాజన్‌రాజు, పెంటారావు, దానయ్య, బి.ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

అగనంపూడి: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని. అందువల్ల ప్రజలంతా చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని తెలుగు మహిళ 79వ వార్డు అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవాని విజ్ఞప్తి చేశారు. వార్డు పరిధిలోని పలు పోలింగ్ బూత్‌ల్లో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని విమర్శించారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు దంతులూరి సుబ్బరాజు, కె.జగదీశ్, ఎం.వెంకటరావు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



79వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రొట్టెల పండగకు వేళాయె..

నేటి నుంచి 17 వరకు
శాతవాహననగర్‌లోని షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవాలు



విద్యుద్దీప కాంతుల్లో శాతవాహననగర్‌లోని షిర్డీ సాయి ఆలయం



బాబా విగ్రహం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 8: జీవీఎంసీ 86వ వార్డు పరిధి శాతవాహననగర్‌లోని షిర్డీసాయి ఆలయ 19వ వార్షికోత్సవాలను శుక్రవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి నామస్మరణతో నవరాత్రులను 216 గంటల పాటు నిర్వహిస్తారు. రోజూ ఆలయానికి విచ్చేసే భక్తులకు మూడు పూటలా ప్రసాద వితరణ, రెండు పూటలా అన్న సమారాధన చేపట్టేందుకు సర్వం సిద్ధం చేశారు. దక్షిణ భారతదేశంలో మరెక్కడా లేని విధంగా అప్పటికప్పుడు సుమారు 30 మంది శ్రమించి రొట్టెలను తయారుచేసి భక్తులకు అందిస్తుంటారు.

సుమారు 4 వేల రొట్టెలు తయారీ

ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ప్రతీ గురువారం సుమారు నాలుగు వేల రొట్టెలు (చపాతీలు) తయారు చేసి కూరతో సహా భక్తులకు అందిస్తుంటారు. ఇక్కడి సాయినాథుని ఆలయంలో 108 సార్లు ప్రదక్షిణలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని పారిశ్రామిక ప్రాంత భక్తుల ప్రగాఢ విశ్వాసం. బాబా ఆలయ ప్రాంగణంలో ధ్యాన మందిరం, కపిలగోవు, లెండీవనం, శునకాన్ని భక్తులు దర్శించుకుంటారు.

షిర్డీలో మాదిరిగా చందనోత్సవాలు..

షిర్డిలో మాదిరిగా ఇక్కడి సాయిబాబా ఆలయంలో హిందువులు, ముస్లింలు కలిసి జెండా ఉత్సవం, చందనోత్సవాన్ని ఘనంగా చేస్తారు. ఈ ఆలయంలో నూతన సంవత్సర వేడుకలు, మహా శివరాత్రి, ఉగాది, శ్రీరామ నవమి, వినాయక చవితి నవరాత్రులు, దత్తజయంతి, గురుపౌర్ణమి, దేవీనవరాత్రులు, కార్తీక మాసం, సంక్రాంతి పర్వదినాల్లో ప్రత్యేక పూజలను స్వామివారికి నిర్వహిస్తుంటారు.



న్యూపోర్టు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లు

ఆశ వర్కర్ల నిరసన ప్రదర్శన

పెదగంట్యాడ, ఫిబ్రవరి 8: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ ఆందోళన కార్యక్రమానికి సిద్ధపడిన తమను హౌస్ అరెస్టులు చేయడం అన్యాయమంటూ పెదగంట్యాడ మండలానికి చెందిన ఆశ వర్కర్లు గురువారం న్యూపోర్టు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. శాంతియుతంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించాలనుకున్న తమను పోలీసులు హౌస్ అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని అగౌరవపరచడమేనన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ స్టీల్‌ప్లాంట్ జోన్ ప్రధాన కార్యదర్శి కోవిరి అప్పలరాజు మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలను సంక్రాంతి తర్వాత పరిష్కరిస్తామని మాటిచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం దారుణమన్నారు. ఆశ వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించడం సమంజసం కాదన్నారు. ఆశ వర్కర్లకు కనీస వేతనంగా రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల వెంకయ్య, హేమలత, సోమేశ్వరి, రేణుకావతి, తదితరులు పాల్గొన్నారు.



వేదికపై జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి మురళీధర్

గాజువాక, ఫిబ్రవరి 8: పర్యావరణ పరిరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళీధర్ అన్నారు. రాష్ట్ర వ్యాప్త సైన్స్ కళా యాత్రలో భాగంగా గురువారం గాజువాక హైస్కూల్‌లో జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో మూఢ నమ్మకాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వీటిని నిర్మూలించేందుకు ప్రభుత్వం చట్టాన్ని అమలు చేయాలని కోరారు. మూఢ నమ్మకాల వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీకే పరశురాం మాట్లాడుతూ విద్యార్థులంతా సైన్స్ ఆవిష్కరణలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సైన్స్‌తోనే జీవితం ముడిపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.విజయప్రశాంతి, జేవీవీ ప్రతినిధులు కె.జనార్దనరావు, అప్పారావు, రమేశ్‌కుమార్, ప్రసాద్, శేషగిరిరావు, రమణ, లక్ష్మణస్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తులు

కొత్తపాలెంలో గైరమ్మ సంబరాలు రేపు

గోపాలపట్నం, ఫిబ్రవరి 8: ఇక్కడి కొత్తపాలెం గ్రామంలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే గైరమ్మ (గౌరి) సంబరాలను ఈ నెల పదో తేదీన అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తపాలెం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గత రెండు దశాబ్దాలుగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడి గౌరీ రామాలయంలో ప్రతి సంవత్సరం కార్తీకంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను ప్రతిష్టించి ఫిబ్రవరి నెల రెండో శనివారం వరకు పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఫిబ్రవరి రెండు లేదా మూడో శనివారం చేపట్టే ఉత్సవమూర్తుల అనుపోత్సవాన్ని పురస్కరించుకుని గైరమ్మ సంబరాలను జరుపుతారు.

గైరమ్మ సంబరాల నాడు పలు రకాల పిండివంటలు, మిఠాయిలతో అమ్మవారి సారెను గ్రామ పురవీధుల్లో భక్తులు ఊరేగిస్తారు. ఆ రోజు రాత్రి ఉత్సవమూర్తులను మేళతాళాలు, తప్పెటగుళ్లు, భాజా భజంత్రీల నడుమ ఊరేగిస్తారు. దీంతో సాయంత్రం నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంటుంది. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. అధిక సంఖ్యలో భక్తులు రానున్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో పాటు గౌరీ సేవా సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తగిన చర్యలు చేపడతారు. ఈ నేపథ్యంలో ఆలయంతో పాటు గ్రామంలోని రహదారులను విద్యుద్దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు.

ఉక్కు జీఎంను దుర్భాషలాడిన కేసులో విచారణ



వివరాలు సేకరిస్తున్న ఏసీపీ త్రినాథ్

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 8: స్టీల్‌ప్లాంట్ ఎల్‌అండ్‌డీసీ జనరల్ మేనేజర్ ఎన్.భానును విభాగం ఉద్యోగి కులం పేరుతో దూషించిన కేసుకు సంబంధించి సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ గురువారం విచారణ చేపట్టారు. ఏసీపీ స్టీల్‌ప్లాంట్‌కు విచ్చేసి జీఎంను, పలువురు సాక్షులను విచారించారు. ఆయన వెంట స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు ఉన్నారు. కాగా కేసు విచారణ చేపట్టి దుర్భాషలాడిన ఉద్యోగిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు బయ్యే మల్లయ్య, తౌడన్న, మోహన్‌బాబు డిమాండ్ చేశారు.

61వ వార్డులో శ్రీరాముని నగర సంకీర్తన

మల్కాపురం, ఫిబ్రవరి 8: జీవీఎంసీ 61వ వార్డు పరిధి రామకృష్ణాపురం, వెంకన్నపాలెం ప్రాంతాల్లో స్థానిక మహిళలు గురువారం ఉదయం శ్రీరామ నామస్మరణ చేస్తూ నగర సంకీర్తన చేపట్టారు. జై శ్రీరామ్ నామస్మరణతో పురవీధుల్లో రాముని పాటలను ఆలపించారు. తొలుత రామకృష్ణాపురం రామాలయంలో పూజలు చేశారు.

నేడు శ్రవణా నక్షత్రం పూజలు

వేపగుంట, ఫిబ్రవరి 8: ఇక్కడి నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో శుక్రవారం స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేయనున్నట్టు అర్చకుడు శ్రీనివాసస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న సమారాధన, సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పఠనం, భక్తి గీతాల ఆలాపన ఉంటుందని పేర్కొన్నారు.



నరవలో చెరువు గర్భం నుంచి రహదారి నిర్మిస్తున్న దృశ్యం

చెరువు గర్భం నుంచి ప్రైవేటు లేఅవుట్‌కు రోడ్డు

రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని నరవ గ్రామస్థుల విజ్ఞప్తి

గోపాలపట్నం, ఫిబ్రవరి 8: జీవీఎంసీ 88వ వార్డు పరిధి నరవ గ్రామంలో సర్వే నంబర్-15లోని చెరువు గర్భం మీదుగా ఓ ప్రైవేటు లే అవుట్‌కు స్థల యజమాని రహదారి నిర్మాణం చేపట్టడం వివాదాస్పదమైంది. సర్వే నంబర్-15లో విస్తారమైన చెరువు గర్భం ఉంది. చెరువుకు సమీపంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన లేఅవుట్‌కు వెళ్లేందుకు చెరువు గర్భం మీదుగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. దీంతో పలువురు గ్రామస్థులు సచివాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు. నిబంధనలను అతిక్రమించి చెరువు గర్భం మీదుగా రహదారి నిర్మించడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, అందువల్ల దీనిపై రెవెన్యూ అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించడంతో పరిశుభ్రంగా ఉన్న రోడ్డు

యారాడ మార్గంలో వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సింధియా, ఫిబ్రవరి 8: యారాడకు వెళ్లే మార్గంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, వ్యర్థాల తొలగింపు పనులను జీవీఎంసీ సిబ్బంది చేపట్టారు. ఈ రోడ్డ మొత్తం చెత్తాచెదారం నిండిపోయి తీవ్ర దుర్గంధం వస్తుండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్టు మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'యారాడకు వెళ్లే మార్గంలో దుర్గంధం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. ఈ మేరకు రెండు రోజులుగా యారాడ మార్గంలోని వ్యర్థాలను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించి పరిశుభ్రంగా తీర్చిదిద్దడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెదగంట్యాడ జంక్షన్‌లో ప్రమాదాలకు చెక్

కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టిన అధికారులు



నిర్మాణ పనుల్లో నిమగ్నమైన కార్మికులు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 8: పెదగంట్యాడ జంక్షన్‌లో ప్రమాదకరంగా ఉన్న కల్వర్ట్ పునర్నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ఇక్కడ రోడ్డు ప్రమాదాలకు పరిష్కారం లభించినట్టయింది. ఈ జంక్షన్‌లో రోడ్డుకు అడ్డంగా అండర్ గ్రౌండ్‌లో కల్వర్ట్ స్లాబ్ విరిగిపోవడంతో పెద్ద గొయ్యి ఏర్పడిందది. ఇది రోడ్డుకు సమాంతరంగా ఉండడంతో ఇక్కడి గోతిని గుర్తించక లువురు వాహన చోదకులు ప్రమాదానికి గురై గాయపడిన సంఘటనలు ఉన్నాయి. అలాగే ఈ మార్గం గుండా వెళ్లాల్సిన 38డి/ ఎస్ రూట్ బస్సులు కూడా పక్క రోడ్డు నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ గొయ్యి వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు పలుమార్లు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఎట్టకేలకు వారు స్పందించారు. దీంతో ఇక్కడ కొత్తగా కల్వర్టును నిర్మించేందుకు గురువారం పనులు ప్రారంభించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఎన్.ఎ.డి. జంక్షన్, ఫిబ్రవరి 8: జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని శాంతినగర్ కమ్యునిటీ హాల్‌లో వికసిత భారత్ సంకల్ప యాత్ర పేరిట కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉజ్వల్ పథకం కింద గ్యాస్ స్టౌవ్‌ల మంజూరు, ఆయుష్మాన్ భారత్ కింద హెల్త్ కార్డులు, ముద్ర లోన్, అటల్ పెన్షన్ యోజన, జీవనజ్యోతి, జీవన సురక్ష ఇన్సూరెన్స్ పథకాలు, వాటి ఉపయోగాల గురించి బీజేపీ నాయకులు, గ్రేటర్ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జీసీ నాయుడు, దాడి రమేశ్, పి.శ్రీనివాసరావు, మంజుల, కృష్ణారావు, చంద్రశేఖర్, యూసీడీ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో కొత్త దుకాణాల నిర్మాణం

ములగాడలో త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు



కొత్తగా నిర్మించిన దుకాణాలు

మల్కాపురం, ఫిబ్రవరి 8: గ్రేటర్ విశాఖ 40, 58 నుంచి 63 వార్డులకు సంబంధించి ములగాడ హౌసింగ్ కాలనీలో ఏర్పాటు చేసిన రైతు బజారులో మరిన్ని దుకాణాలను కొత్తగా నిర్మించారు. గతంలో ఇక్కడ సుమారు ఇరవై దుకాణాలు ఉండగా, తాజాగా తొమ్మిది దుకాణాలను నిర్మించడం జరిగింది. వీటిని త్వరలోనే ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రైతు బజారు ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతుంది. ఈ బజారును మరింత విస్తరించే యోచనలో అధికారులు ఉన్నారు. కాగా ములగాడ హౌసింగ్ కాలనీ పరిసర ప్రాంతాలవారు మాత్రమే ఈ రైతు బజారును వినియోగించుకుంటున్నారు. ఇది మెయిన్ రోడ్డుకు దూరంగా ఉండడం, వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తడం వల్ల అధిక శాతం మంది రాలేకపోతున్నారు. ఈ రైతు బజారు విస్తీర్ణం ఎక్కువగా ఉన్నప్పటికీ ఒకవైపు తహసీల్దార్ కార్యాలయం ఉన్నందున దీనిని పూర్తి స్థాయిలో నడపలేకపోతున్నామని రైతుబజారు అధికారులు పేర్కొంటున్నారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయాన్ని శ్రీరామ్‌నగర్‌కు తరలిస్తే ప్రజలంతా ఈ రైతు బజారును వినియోగించుకునేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో విశ్వనాథం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 8: విద్యార్థులంతా ఇష్టంతో శ్రమించి చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని గాజువాక ఎంఈవో విశ్వనాథం అన్నారు. గురువారం ఆయన 87వ వార్డు పరిధి కణితి హైస్కూల్‌ను సందర్శించి లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులకు పలు రకాల బోధనల గురించి వివరించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారు చెప్పిన సమాధానాలతో ఆయన సంతృప్తి చెందారు. విద్యార్థులను మెరికల్లా తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సూర్యప్రకాశ్, కృష్ణారావు, శ్రీనివాస్, మన్నాజీ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కప్పస్తంభం ఆదాయం రూ.7.8 లక్షలు

సింహాచలం, ఫిబ్రవరి 8 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఖజానాకు గత నెలలో కప్పస్తంభం ఆలింగనాల ద్వారా రూ. 7.8 లక్షల ఆదాయం సమకూరింది. రూ. 25 టికెట్లు తీసుకుని గత నెలలో మొత్తం 31452 మంది భక్తులు కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. దీనిద్వారా స్వామివారి ఖజానాకు రు.7,86,300 ఆదాయం లభించినట్టు అధికారులు తెలిపారు.

ఉక్కు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 8: స్టీల్‌ప్లాంట్ లోపల గల శివాలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని గురువారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. ఉక్కు ఉద్యోగులు, కార్మిక సంఘ నాయకులు రుద్రాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమరాధన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు యేల్లేటి శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడిలో సాయినాథునికి..

అగనంపూడి: ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయంలో షిర్డీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అర్చకులు అలంకరించి పూజలు జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో సాయినాథున్ని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం పలువురు భక్తులు విష్ణుసహస్రనామ, లలితాపారాయణాలను పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, రామారావు, లీలావతి, సత్యలక్ష్మి, పంకజం, సూరీడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో తనిఖీలు



సమావేశంలో ఎంఈవో, పర్యవేక్షణాధికారులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 8: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో-1 రామారావు, జిల్లా పర్యవేక్షణాధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలకు ఆలస్యంగా వచ్చిన వారి వివరాలు సేకరించారు. అనంతరం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా పర్యవేక్షణాధికారులు ఎంవీ ధర్మారావు (తెలుగు), వి.హరి సుశీల (ఇంగ్లీష్), టి.రమణ (గణితం), రియాజ్ (సైన్స్)తో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి, పలు సూచనలు ఇచ్చారు. పాఠ్య, వార్షిక ప్రణాళికలు, బోధన, అభ్యసన సామగ్రి, టీచింగ్ డైరీలు, లీప్ పరీక్ష పత్రాలు, పిల్లల హాజరు నమోదు రిజిస్టర్లను పరిశీలించారు.

వన్‌టౌన్‌లో రహదారులు అధ్వానం

- గోతులతో నరకయాతన..
- నాలుగేళ్లుగా అభివృద్ధి శూన్యం

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 8: వన్‌టౌన్‌లోని పలు రహదారులు అధ్వానంగా మారాయి. ఏళ్లు గడుస్తున్నా పరిస్థితి మారకపోవడంతో నిత్యం స్థానికుల అవస్థలు పడుతున్నారు. టర్నర్ చౌల్ట్రీ నుంచి పాత పోస్టాఫీసు వరకు రోడ్డు విస్తరణపై గొప్పగా చెప్పుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి మెయిన్ రోడ్డు కనెక్టవిటీ రోడ్ల అధ్వాన పరిస్థితిని పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. మెయిన్ రోడ్డు ఆంజనేయ స్వామి గుడి నుంచి లోపలకు వెళ్లే చాకలివీధి, ఏనుగుల వీధి, వార్డుబాయస్ లైను పూర్తి గోతులమయంగా మారాయి. జీవీఎంసీ 30, 36 వార్డు బోర్డర్ రహదారి మార్గం ఇదే దుస్థితిని తలపిస్తోంది. పూర్ణామార్కెట్‌కు కనెక్టవిటీగా ఉన్న రోడ్డుపై నిత్యం కార్లు, ఆటోలు, లగేజీ వాహనాలు, ద్విచక్రవాహనాలు భారీగా ప్రయాణిస్తాయి. ఇటువైపు రోడ్లు పూర్తి గోతులమయంగా మారి ప్రయాణికులను భయపెడుతున్నాయి. చాకలివీధి, ఏనుగులవీధి, బాబ్జీ కొండ ప్రాంతీయులు నిత్యం ఈ మార్గంలో



చాకలివీధిలో నడిచేందుకు కూడా వీలులేని దుస్థితిలో రహదారి



30వ వార్డులోని ఓ రోడ్డు దుస్థితి..

ప్రయాణిస్తుంటారు. రోడ్లు అధ్వానంగా మారినా కార్పొరేటర్లు కోడూరు అప్పలరత్నం, (30వ వార్డు) మాసిపోగు మేరీజోన్స్ (36వ వార్డు) పట్టించుకోవడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ రెండు సార్లు ఇదే నియోజవకర్గం నుంచి విజయం సాధించినా కనీసం రహదారుల దుస్థితిని పట్టించుకున్న పాపాన పోలేదని ఈ ప్రాంతీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ నియోజకవర్గంలో అనేక వార్డుల పరిధిల్లో రోడ్ల దుస్థితి ఇదే విధంగా ఉన్నా దృష్టి సారించడం లేదంటున్నారు. కేజీహెచ్ డౌన్ నుంచి విజేత ఆస్పత్రి మెయిన్‌రోడ్డు కనెక్టవిటీ కుమ్మరవీధి, జెండా చెట్టువీధి అధ్వానంగా మారాయి. చాకలిపేట, ఏనుగుల వీధి నుంచి రోగులు కేజీహెచ్ ఓపీకి వెళ్లాలంటే గతుకుల రోడ్ల కారణంగా తీవ్ర అవస్థలు ఎదురవుతున్నాయి. ఆటోలు, ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తే మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు స్పందించి రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

నేడు నగరంలో యువశక్తి సదస్సు

- పల్సస్ సీఈఓ డాక్టర్ శ్రీనుబాబు గేదెల



మాట్లాడుతున్న శ్రీనుబాబు

సిరిపురం, ఫిబ్రవరి 8: మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకుందామనే నినాదంతో శుక్రవారం సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో యువశక్తి సదస్సు నిర్వహించనున్నట్టు పల్సస్ గ్రూప్ సీఈఓ డాక్టర్ శ్రీనుబాబు గేదెల తెలిపారు. ఈ మేరకు గురువారం హోటల్ మేఘలయాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ పంటను తామే మార్కెటింగ్ చేసుకునేందుకు, విద్యార్థులు తమ కాళ్లపై తామే నిలబడేందుకు అనుసరించాల్సిన విధానాలను ముగ్గురు నిపుణులు వివరిస్తారన్నారు. సదస్సుకు పెద్దసంఖ్యలో యువత హాజరుకానున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ తరహా సదస్సులు నిర్వహిస్తామన్నారు.

కేకే లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్‌రైలు

అరకులోయ, ఫిబ్రవరి 8: కొత్తవలస-కిరండోల్ (కేకే) రైల్వే లైనులో చిమిడిపల్లి స్టేషన్ సమీపంలో 70/28 కిలోమీటరు వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో చోటుచేసుకుంది. దీంతో కేకే లైనులో గూడ్స్ రైళ్ల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోగా, విశాఖపట్నం నుంచి కిరండోల్ వెళ్లే పాసింజరు రైలు ఆలస్యంగా నడిచింది. ఉదయం పది గంటలకు అరకులోయ రావాల్సిన పాసింజర్ సాయంత్రం నాలుగు గంటలకు వచ్చింది. రైల్వే ఉన్నతాధికారులు...సిబ్బందితో అక్కడకు చేరుకుని మధ్యాహ్నం మూడు గంటలకల్లా ట్రాక్ పునరుద్ధరణ పనులు పూర్తిచేశారు.

డీఎస్సీ అభ్యర్థుల్లో ఆందోళన

... 5వ పేజీ తరువాయి

మార్కులు వస్తేనే డీఎస్సీలో పోస్టు కొట్టేందుకు అవకాశం ఉంటుంది. అందువల్ల టెట్, డీఎస్సీ పరీక్ష మధ్య సమయం ఇవ్వకపోతే ఎలా?...అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 27వ తేదీ టెట్, వచ్చే నెల 15వ తేదీ నుంచి డీఎస్సీ నిర్వహించబోతున్నారని...ఇంత తక్కువ వ్యవధిలో రెండు పరీక్షలకు ఎలా సిద్ధం కాగలమని అడుగుతున్నారు. ఆరేళ్ల తరువాత నిర్వహించనున్న డీఎస్సీకి తీవ్రమైన పోటీ ఉండనున్నందున అభ్యర్థులు ప్రణాళికాయుతంగా ప్రిపేర్ కావాలంటే తగినంత సమయం ఉండాలని డైట్ రిటైర్డు లెక్చరర్ ప్రభాకరరావు అభిప్రాయపడ్డారు. రెండు పరీక్షల మధ్య తగినంత సమయం ఇవ్వకపోతే అభ్యరులు తీవ్ర ఒత్తిడికి గురవుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో టెట్, డీఎస్సీ పరీక్షల మధ్య తగినంత సమయం ఉండేలా ప్రభుత్వం, డీఎస్సీ షెడ్యూల్‌లో మార్పులు చేయాలని కోరుతూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ హేమంత్‌కుమార్ స్పష్టంచేశారు. ఇంకా డీఎస్సీలో పోస్టులు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిన జగన్

- టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ



సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం పీకల్లోతు అప్పుల్లో మునిగిపోయిందని టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆరోపించారు. గురువారం పార్టీకార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్థిక మంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ అని, రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 2019 వరకు అన్ని ప్రభుత్వాలు కలిపి రూ.2.87 లక్షల కోట్ల అప్పులు చేస్తే ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. రిజర్వుబ్యాంకు విధించిన ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి అప్పులు చేశారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర సుజలస్రవంతి ప్రాజెక్టుకు పైసా కేటాయించలేదని, ఐదేళ్లుగా ప్రాజెక్టును మూలపడేశారని ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్రలో వంశధార, తోటపల్లి, వెంగళరాయసాగర్ ప్రాజెక్టును గాలికొదిలేశారని, బడ్జెట్‌లో విశాఖ నగరానికి ఎటువంటి కేటాయింపులులేవని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ లోటు రూ.14వేల కోట్లుంటే ప్రస్తుతం అది రూ.55వేల కోట్లకు చేరిందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఐదేళ్లగా అన్ని శాఖలలో పనులుచేసిన కాంట్రాక్టర్లకు రూ.95 వేల కోట్లు బిల్లులు ఎందుకు పెండింగ్‌లో పెట్టిందో చెప్పాలని నిలదీశారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద నగరానికి కేంద్రం ఇచ్చిన నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల ముందు మెగా డీఎస్సీ తెస్తానని హామీ ఇచ్చిన జగన్, గద్దె దిగిపోయే ముందు చేసిన మినీ డీఎస్సీ ప్రకటన మోసం చేయడమేనన్నారు.

భూ చట్టం ప్రజల పాలిట భస్మాసుర హస్తం

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం ప్రజల పాలిట భస్మాసుర హస్తమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ చట్టం వల్ల నిజమైన భూమి హక్కు దారుడు బికారిగా మారాల్సిన పరిస్థితి ఎదురవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంకా వారసత్వంగా లేదా కష్టార్జితం కొనుగోలుచేసిన ప్రైవేటు భూములపై ప్రభుత్వ పెత్తనం ఏంటని ప్రశ్నిస్తున్నారు, ఈ చట్టం వల్ల రెవెన్యూ అధికారుల జోక్యంతో మొత్తం వ్యవస్థే చిన్నాభిన్నమై కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. భూముల తగదాలు కోర్టు పరిధి నుంచి తప్పించటం కుట్ర పూరితమని ఆరోపించారు. ఉత్తర నియోజకవర్గంలో మురళీనగర్, మాధవధార ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన మిగులు భూముల్లో ఇళ్లులేని పేదలకు ఇళ్లు నిర్మించాలనే అంశంపై పోరాటం చేయాలని నిర్ణయించామన్నారు. విలేకరుల సమావేశంలో సనపల వరప్రసాద్, శ్రీనివాస్, జగదీష్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై కక్ష సాధింపు

... 5వ పేజీ తరువాయి

ఆదేశాలు వచ్చాయి. కొన్నిరోజుల పాటు అప్‌లోడ్ చేసిన సిబ్బంది ఆ తరువాత పూర్తిగా మానేశారు. అయితే సమ్మె విరమించి విధుల్లో చేరిన తరువాత ప్రతిరోజూ టాయ్‌లెట్ల ఫొటోలు అప్‌లోడ్ చేయాలంటూ సిబ్బందికి ఆదేశాలు వచ్చాయి. అలాగే, సమయపాలన విషయంలోనూ కఠినంగా వ్యవహరిస్తున్నారు. కేంద్రాలకు పిల్లలను తీసుకువచ్చేందుకు కొన్నిసార్లు ఆయాలు బయటకు వెళుతుంటారు. కానీ, సూపర్‌వైజర్లు తనిఖీలకు వెళ్లినప్పుడు సిబ్బంది లేకపోతే తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీచేస్తున్నారు. ఉదయం తొమ్మిది నుంచి ఐదు గంటల వరకు తప్పనిసరిగా కేంద్రాల్లో ఉండాలని, లేకపోతే చర్యలు ఉంటాయంటూ హెచ్చరిస్తున్నారు. ఇన్నేళ్ల ఉద్యోగ జీవితంలో ఇటువంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదంటూ పలువురు సిబ్బంది వాపోతున్నారు. ఈ విషయం అసోసియేషన్ నాయకుల దృష్టికి తీసుకువెళుతున్నారు.

11న శ్రీనివాస కల్యాణ మహోత్సవం



కల్యాణోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, ఫిబ్రవరి 8: టీపీటీ కాలనీ ద్రావిడ సంక్షేమ సంఘం లలితా నూకల కామేశ్వరి కల్యాణ మండపంలో ఈనెల 11న శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఆధ్యాత్మికవేత్త వి.ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు పౌరగ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ శృతిలయ సాంస్కృతిక భక్తి సేవా సంస్థ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ నెల10న ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ద్వారం త్యాగరాజు సంగీత కచేరి, కోలాటం, కూచిపూడి నృత్యం, వేణుగానం, వీణవాదనం, నిర్వహిస్తామన్నారు. 11వ తేదీ ఆదివారం ఉదయం 9 నంచి సీతమ్మధార త్రిమూర్తిక వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి కల్యాణ వేదిక వరకు ఉత్సవ మూర్తుల తిరువీధి, సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సీహెచ్‌వీ సత్యనారాయణ, కొణతాల రాజు, ఎంఎస్ మాధవ్, ఫణిస్వామి, మస్తాన్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 8: గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో గురువారం ఓమ్నీ ఆర్కే ఆస్పత్రి, మంగళ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యం లో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నాల్గో అదనపు జడ్జి మహదాస్ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు



సదస్సులో మాట్లాడుతున్న ఏడీసీపీ శ్రీనివాసరావు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 8: రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు, నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీసీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా ప్రయాణించాలన్నారు. విద్యార్థులతో కలిసి జ్ఞానాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు, టీషర్టులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్.నాగేశ్వరరావు, సి.బాలరాజు, ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ ఎస్ఐ ఎం.ప్రసన్న, డాక్టర్ మాణిక్యకుమారి, డాక్టర్ అరుణాదేవి, డాక్టర్ జె.నిర్మల పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను అమర్చుకోవాలి

సీతమ్మధార: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు తప్పనిసరిగా అమర్చుకోవాలని ఈస్ట్ సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆడమ్ పేర్కొన్నారు. అక్కయ్యపాలెంలో షాదీఖానాలో ఎస్ఐ కె.భాస్కరరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రతి అపార్టుమెంట్‌లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు డి.అప్పారావు, ఎ.సత్యారావు, ఎండీ ఆబీబ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడుతున్న రోడ్లు

... 5వ పేజీ తరువాయి

జ 11 ప్రమాదాలు జరగ్గా ఆరుగురు మృతిచెందారు. ఈ నెల ఆరో తేదీన పెదవాల్తేరులోని నీలాపు వీధికి చెందిన విజయనగరం పైడితల్లిఅమ్మవారి దర్శనానికి బైక్‌పై వెళ్లారు. దర్శనం తర్వాత నగరానికి తిరిగి వస్తుండగా మధురవాడ సమీపంలోని బోరవానిపాలెం వద్దకు వచ్చేసరికి రోడ్డుకు అడ్డంగా వచ్చిన గేదెను తప్పించబోయి అదుపుతప్పి కిందపడిపోయారు. అదే సమయంలో పక్క నుంచి వెళుతున్న గ్యాస్ లారీ ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయారు. ఈనెల నాలుగున ఎండాడ నుంచి గీతం కాలేజీ రోడ్డులో అతివేగంతో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీన్నాయి. ఆ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడ మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో మృత్యువుతోపోరాడుతున్నారు. అదేవిధంగా బీచ్‌రోడ్డులో అపరిమితం వేగంతో వెళుతున్న కారు సీతకొండ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో కారు నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు.

అతివేగమే ప్రమాదాలకు కారణం

నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అతి వేగమే కారణమని పోలీసులు చెబుతున్నారు. ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా, ఎన్నిసార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా కొంతమంది యువకులు దృక్పథం మారడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బీచ్‌రోడ్డు, శివారు ప్రాంతాల్లోని విశాలమైన రోడ్లు, జాతీయ రహదారి, బీఆర్‌టీఎస్ రహదారుల్లో వాహనాలను అపరిమిత వేగంతో నడుపుతున్నారని, అనుకోని అవరోధం హఠాత్తుగా ఎదురయ్యేసరికి వాహనాన్ని అదుపు చేయలేక ప్రమాదాల బారినపడుతున్నారని చెబుతున్నారు. ఎక్కడికక్కడ వాహనాల తనిఖీలు చేస్తున్నాసరే ఏదో మార్గంలో తప్పించుకుని వెళ్లిపోతున్నారంటున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తున్నాసరే పెద్దగా ఫలితం ఉండడం లేదని చెబుతున్నారు.

39వ వార్డులో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం



నాగబాబుకు జ్ఞాపిక అందిస్తున్న నాయకులు



పార్టీలో చేరిన వారితో ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషా కిరణ్

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 8: వైసీపీ ఓటమే లక్ష్యంగా జనసేన శ్రేణులను సన్నద్ధం చేస్తున్నట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు పేర్కొన్నారు. 39వ వార్డు లక్ష్మీటాకీస్ వద్ద పార్టీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ సాధిక్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. నియోజకవర్గంలో వైసీపీ ఓటమి ఖాయ మని జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు నాగబాబును ఆశీ ర్వదించారు. జనసేన ముఖ్యనాయకులకు పార్టీ కండువాలతో సత్కరించారు. సుందరపు సతీష్‌కుమార్, వసంతలక్ష్మి కందుల నాగరాజు, చీకటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

మర్రిపాలెం: గ్రేటర్ 53వ వార్డు మర్రిపాలెంలో జనసేన వార్డు అధ్యక్షుడు తాటిపాకల మాణిక్యాలరావు, మహిళా అధ్యక్షురాలు మొగసాల సుజన ఆధ్వర్యంలో గురువారం మహిళా సదస్సు నిర్వహించారు. అనంతరం 50మంది మహిళలు జనసేన పార్టీలో చేరగా, వారికి పార్టీ ఉత్తర కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ కండువాలు వేసి ఆహ్వానించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను బలపరచాలన్నారు. నీరుకొండ దివాకర్, సుంకర విజయ్, అప్పాజీ, తరుణ్, కిశోర్, మహేష్, లీనా తదితరులు పాల్గొన్నారు.

వెబ్ సిరీస్‌లో మాదిరిగానే...

... 5వ పేజీ తరువాయి

హత్య చేస్తుంది. మరొక సిరీస్‌లో హీరోగా నటించిన గంగారావు ఒక సన్నివేశంలో పురుషుడి మర్మాంగాలను కోసి చంపేస్తాడు. రెండింటిలో హింసాత్మక దృశ్యాలు ఎక్కువగా ఉండడంతో సెన్సార్ బోర్డు వాటి విడుదలకు అనుమతిని నిరాకరించింది. హైదరాబాద్‌లో ఒక వ్యక్తికి కాంట్రాక్టులు ఇప్పిస్తానని రూ.1.5 కోట్లు వసూలుచేసి వెబ్ సిరీస్‌కు ఖర్చుపెట్టేశాడు. మరోవైపు కాంట్రాక్టులు ఇప్పించకపోవడంతో డబ్బులు ఇచ్చిన వ్యక్తి...గంగారావుపై ఒత్తిడి తేవడం మొదలెట్టాడు. తాను నిర్మించిన సిరీస్ స్ట్రీమింగ్ అయిన వెంటనే డబ్బులు ఇచ్చేస్తానని గంగారావు అవతలి వ్యక్తికి చెప్పుకుంటూ వచ్చాడు. చివరకు డబ్బులు ఇవ్వకపోవడంతో కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గంగారావుపై కేసు నమోదైంది. ఇదిలావుండగా తాను నిర్మించిన వెబ్ సిరీస్‌లో హీరోయిన్ క్యారెక్టర్ ఒక సన్నివేశంలో ఒక యువకుడిని శిలువతో తలపై కొట్టి హత్య చేసినట్టుగానే గంగారావు కూడా తహసీల్దార్ రమణయ్యను రాత్రి పూట ఇనుపరాడ్డుతో తలపై మోది హత్య చేయడం గమనార్హం.

వైసీపీ వైరస్‌ను తరిమికొట్టాలి

... 5వ పేజీ తరువాయి

పంచకర్ల రమేశ్‌బాబు అంశాల వారీగా నాగబాబుకు వివరించారు. పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల అని కార్యకర్తలు నినాదాలు చేయగా...పంచకర్ల వారిని వారించబోయారు. నాగబాబు జోక్యం చేసుకుని అభిమానాన్ని కట్టడి చేయొద్దని, అయితే సీటు ఎవరికిచ్చినా గెలుపు లక్ష్యం కావాలన్నారు. అనంతరం నాగబాబును పంచకర్ల, ఇతర నేతలు గజమాలతో సత్కరించారు. సమావేశంలో ఎలమంచిలి ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, సుందరపు సతీష్, అయిత సింహాచలం, పిళ్లా జగన్మోహనపాత్రుడు, ముదునూరి రాజసుధాకర్, పిన్నింటి వరలక్ష్మి, ఒబ్బిన శ్రీకాంత్, ముక్క గోపి, గొల్లవిల్లి శ్రీను, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహనతోనే పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ



పీజే రావుకు అవగాహనా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

కంచరపాలెం, ఫిబ్రవరి 8: అవగాహనతోనే పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించవచ్చునని కెమికల్ కళాశాల అల్యూమిని ఆఫ్ సేఫ్టీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ పీజే రావు పేర్కొన్నారు. కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రతా విభాగాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పరిశ్రమల్లో భద్రతపై అవగాహన, జనరల్ బాడీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ పీజే రావు పాల్గొని అసోసియేషన్ ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు, ఉద్యోగుల్లో భద్రతపై అవగాహన కల్పించేందుకు సభ్యులంతా కృషిచేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ సేఫ్టీ కోర్సుల ద్వారా ప్రమాదాల బారిన పడకుండా మేల్కొనవచ్చునన్నారు. కార్యక్రమంలో కెమ్‌దోసా అధ్యక్షుడు ఎ.వరహాలు, డా.బీవీ.లక్ష్మణరావు విభాగాధిపతులు, కమిటీ సభ్యుడు కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తెలుగు సినిమా వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట, ఫిబ్రవరి 8: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా పౌరగ్రంథాలయంలో నిర్వహించిన తెలుగు సినిమా వేడుకల సభ గురువారంతో ముగిసింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను తెలిపే పాతచిత్రాలు అమూల్యమైనవని, రాష్ట్రంలో ఇటువంటి ఫెస్టివల్‌కు ప్రభుత్వ ఆదరణ కరువైందన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎన్ఏడీ పాల్, కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, హుస్సేన్, చాట్లా బాబూరావురెడ్డి, ఉషా, రవి, డాక్టర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో 'ఉక్కు' నాయకుల నిరసన ప్రదర్శన



ఢిల్లీలో నిరసన తెలుపుతున్న నాయకులు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 8: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు గురువారం న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు మంత్రి గోపీనారాయణ, చీకటి శ్రీనివాసరావు, గొందేశి ప్రభాకరరెడ్డి, శ్రీను, పెంటయ్య, పిట్టా రెడ్డి, ఉక్కు నిర్వాసిత సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కప్పస్తంభం ఆదాయం రూ.7.8 లక్షలు

సింహాచలం, ఫిబ్రవరి 8 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఖజానాకు గత నెలలో కప్పస్తంభం ఆలింగనాల ద్వారా రూ. 7.8 లక్షల ఆదాయం సమకూరింది.రూ. 25 టికెట్లు తీసుకుని గత నెలలో మొత్తం 31452 మంది భక్తులు కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. దీనిద్వారా స్వామివారి ఖజానాకు రు.7,86,300 ఆదాయం లభించినట్టు అధికారులు తెలిపారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, ఫిబ్రవరి 8 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచారు. ఆలయ పద్మనిధి నుంచి బంగారు సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేశారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ నామానికొక స్వర్ణ పుష్పంతో పూజలు చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం వైభవంగా జరిపారు.

వెంకన్నకు తులసీ దళార్చన

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 8 : ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో జరుగుతున్న వెంకన్న వైభవోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 7.30 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఉదయం లక్ష తులసీ దళార్చన, సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం,సంకీర్తనామామృతం, ఏకాంత సేవ, మంగళశాసనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవల్లభ వేంకటేశ్వరస్వామి ఆధ్యాత్మిక పీఠం, కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ఆకట్టుకున్న షణ్ముఖ శర్మ ప్రవచనాలు



ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 8 : ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరు ఏబీసీ పార్కు ఆవరణలో బుధవారం నుంచి ఈనెల 14 వరకూ సామవేదం షణ్ముఖ శర్మ ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహిస్తున్నారు. జ్యోతిష్య నిపుణుడు కందాళ వెంకట సత్య శ్యామ్,అరుణాగాయత్రి దంపతుల నేతృత్వంలో గురువారం హనుమాన్ చాలీసా వ్యాఖ్యానాలు ఏర్పాటు చేశారు. హనుమద్వైభవ ప్రవచనాల మహోత్సవాల పేరిట జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 8.30 నుంచి 1 గంట వరకూ శ్రీరామ షడక్షర పూర్వక హనుమద్వైభవ మహాయాగం, సాయంత్రం 5.30 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, 6.30 నుంచి షణ్ముఖ శర్మ ప్రసంగాలు జరిగాయి. అలాగే రత్నమాల బృందం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించింది.

అభ్యసనా సామర్థ్యం పరిశీలన

భీమునిపట్నం/తగరపువలస, ఫిబ్రవరి 8 : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డైట్ ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్, అధ్యాపకులు గురువారం సందర్శించారు. ఈసందర్భంగా వారు విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు.ఉపాధ్యాయుల బోధన కూడా ఎలా ఉందో గమనించారు. విద్యార్థులను సబ్జెక్టుల వారీగా చదివించడం, రాయించడం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పొన్నగంటి రమణ, డైట్ అధ్యాపకులు సారిపిల్లి త్రినాథ్, ఎం.మహాలక్ష్మి, పి. హరిణి, జి. మాధవి పాల్గొన్నారు. అలాగే బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను కూడా డైట్ అధ్యాపకులు సందర్శించి, పిల్లల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు.

సినిమా గైడ్

- **ఈగెల్ :** జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శరత్, సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఈగెల్ :** మెలోడి, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం),
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** సంగం, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20,టమాటా 32, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 40, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 50, బీరకాయలు 46, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 18, క్యారేట్ 24, దొండకాయలు 40, బంగాళా దుంపలు 22, అరటికాయ (పె)4, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 110, బరబటి 26, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 36, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 32 , కంద 58, దేముడు చిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	112
ఫారం ధర	--	132
విత్ స్కిన్	--	234
స్కిన్‌లెస్	--	244

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

అమ్మో.. ఈ కంపు భరించలేం...

- చిప్పాడలో అత్యంత దారుణంగా పారిశుధ్యం
- పూడికలతో నిండిపోయిన కాలువలు
- వీధుల్లో మురుగు ప్రవాహం

భీమిలి మండలంలో అతి పెద్ద పంచాయతీగా ఉన్న చిప్పాడలో పారిశుధ్యం దుస్థితి ఇది. పంచాయతీలోని ఏ వీధిలో చూసినా.. మురుగు నీరు ప్రవాహంలా కనిపిస్తోంది. డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడం, ఉన్న చోట నెలలు తరబడి పూడికలు తీయకపోవడంతో కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి, మురుగు వీధుల్లోకి వస్తోంది. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అంతేకాదు రాకపోకలకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు దుర్వాసన భరించకలేక ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. కొన్ని నెలలుగా ఈ దుస్థితి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. దివీస్ కంపెనీ సహకారంతో గ్రామంలో చెత్త తరలింపునకు వాహనాలను ఏర్పాటు చేసారు. కానీ డ్రైనేజీల విషయంలో పంచాయతీ నిర్లక్ష్యంగా ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పంచాయతీలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

\- భీమునిపట్నం (రూరల్)



నివాసాల ముందు నిలిచిన మురుగు నీరు



పెదవీధిలో దుస్థితి

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్

ఆరిలోవ, ఫిబ్రవరి 8 : క్లాప్ వాహనాలు ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన 9వ వార్డు దయాళనగర్ వద్ద ఉన్న కార్యాలయాన్ని, ముడసర్లోవ ఎంఎస్ఎఫ్, కాపులుప్పాడ డంపింగ్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు క్రమం తప్పకుండా చెత్త సేకరణ చేపట్టాలన్నారు. ముడసర్లోవలోని ఎంఎస్ఎఫ్‌లోని వేయింగ్ మిషన్‌ను పరిశీలించి ఎంత చెత్త సేకరిస్తున్నారు, ఎంత చెత్త డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారన్నది అధికారులను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డులో చెత్త నిల్వ లేకుండా ప్రతిరోజూ కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. అనంతరం ఆయన కాపులుప్పాడ డంపింగ్ యార్డులోని జిందాల్ విద్యుత్ ప్లాంట్, బయో మైనింగ్, వ్యర్థాల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి సురేష్‌కుమార్, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్. పర్యవేక్షక ఇంజనీరు కృష్ణారావు, ఏఎంహెచ్ఓ కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ముడసర్లోవ డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న అధికారులు

సీసీ కెమెరాలతో నేరాలు అదుపు : సీఐ



బాలాజీనగర్‌లో మాట్లాడుతున్న సీఐ రమేష్

తగరపువలస, ఫిబ్రవరి 8 : దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చునని భీమిలి సీఐ డి. రమేష్ అన్నారు. గురువారం ఆయన బాలాజీనగర్, పెరికివీధిలో స్థానికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపార్టుమెంట్లు, దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల వల్ల ఎటువంటి నేరాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉంటారని చెప్పారు.

వెబ్‌సైట్‌లో ఏయూ ప్రగతి వివరాలు : వీసీ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 8 : ఏయూలోని ప్రతి విభాగంలో జరిగే ప్రగతిని వెబ్‌సైట్‌లో పొందుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ఆయన ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన బీఓఎస్ సమావేశంలో మాట్లాడారు. ఆచార్యులు సాధించే అవార్డులు, పేటెంట్లు, వారు పాల్గొనే జాతీయ, అంతర్జాతీయ సదస్సులు వంటివి ఎప్పటికప్పుడు విభాగాల వారీగా సమాచారాన్ని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఒక ప్రత్యేక విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.విభాగ స్థాయి నుంచి విశ్వవిద్యాలయం వరకు అభివృద్ధికి సంబంధించిన సమగ్ర సమాచారం అందులో ఉంటుందన్నారు. అలాగే ఏటా నాక్ సన్నద్ధత జరుగుతుందని, ఏడేళ్ల తరువాత నాక్ స్కోర్ కనీసం 3.8 గ్రేడ్ పాయింట్ల కంటే ఎక్కువగా ఉండేలా అన్ని విభాగాలు పనిచేయాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై సభ్యులు చర్చించి, నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె. సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్. కిషోర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, ఫిబ్రవరి 8 : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నగరంపాలెం 11 కేవీ ఫీడర్ నిర్వహణ దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్- 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్ నగర్, పోర్టు కాలనీ, కళానగర్, బొట్టవానిపాలెం, స్వతంత్రనగర్ కాలనీ, వాంబేకాలనీ, శ్రీనివాస్ నగర్, అయోధ్యనగర్, ఆర్టీసీ కాలనీ, మానం ఆంజనేయనగర్, మల్లయ్యపాలెం, నగరంపాలెం ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 8 : రేవిడి పీహెచ్‌సీలో వైద్యాధికారిణి కె. స్వప్న విద్యార్థులకు గురువారం నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వీటిని పంపిణీ చేసినట్టు చెప్పారు. మండలంలో 8311 మంది విద్యార్థులకు మాత్రలు వేయనున్నట్టు ఆమె తెలిపారు.

బంద్‌ను విజయవంతం చేయండి : సీపీఎం

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 8 : ప్రధాని మోదీ కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16న జరగనున్న దేశవ్యాప్త బంద్‌ను ప్రజలు విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు పిలుపునిచ్చారు. గురువారం ఆయన పలు గ్రామాల్లో బంద్‌కు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి, 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అప్పలనాయుడు, చిన్నారావు, ఆదినారాయణ, రమణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలన



మద్దిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీధర్

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 8 : ఎన్నికల కమిషన్ ఆదేశాలను పక్కాగా అమలు చేసేందుకు సిబ్బంది సహకరించాలని తహసీల్దార్ శ్రీధర్ అన్నారు. గురువారం ఆయన పద్మనాభం, మద్ది, కృష్ణాపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల ఏర్పాట్లపై ఆరా తీసారు. విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు, ర్యాంపల నిర్మాణాన్ని పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సిబ్బంది సహకరించాలన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లింగన్నపేటలో ఘనంగా ఆలయ వార్షికోత్సవం



విగ్రహాల ఊరేగింపులో కోలాటం

పద్మనాభం, ఫిబ్రవరి 8 : లింగన్నపేటలో వేదమాత గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ముందుగా పల్లకీపై గాయత్రీదేవీ, లలితాదేవి, దుర్గాదేవి ఉత్సవ విగ్రహాలను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు జలంతో కూడిన కలశాలను శిరస్సున ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కాగా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కనకధారా స్తోత్రాన్ని 108 సార్లు పారాయణం చేస్తారు. శనివారం ఉదయం పెళ్లిరాట అనంతరం దత్తాత్రేయ స్వామి, అనఘాదేవి కల్యాణం నిర్వహిస్తారు.

14న గీతంలో ఎన్ఏవోపీ వార్షిక సమావేశాలు

ఎండాడ/ సాగర్‌నగర్, ఫిబ్రవరి 8 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈనెల 14 నుంచి 16 వరకు నేషనల్ అకాడమీ ఆఫ్ సైకాలజీ (ఎన్ఏపీ) 33వ వార్షిక సమావేశాలు నిర్వహించనున్నట్టు గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ అప్లైడ్ సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, సమావేశాల కన్వీనర్ డాక్టర్ డి. రవిశంకర్ అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజ సుస్థిర అభివృద్ధిలో మానసిక అంశాల పాత్రపై పరిశోధకులు ఈ సమావేశాల్లో చర్చలు జరుపుతారని వివరించారు. దేశంలో ప్రముఖ ఐఐటీలు, ఐఐఎంలు, కేంద్ర పరిశోధన సంస్థల నిపుణులు, మాజీ వీసీలు పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ 'ఎన్ఏవోపీ.గీతం.ఈడీయూ'ను పరిశీలించాలని ఆయన సూచించారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి



వెంకోజీపాలెం, ఫిబ్రవరి 8 : ఏయూ గ్రంథాలయంలో ఈ-రిసోర్సెస్‌ని విద్యార్థులకు అందుబాటులో ఉంచేలా నూతనంగా నింబస్ ఎం.లైబ్రరీ మొబైల్ యాప్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గురువారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ సేవలను వీసీ ప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న డిజిటల్ రిసోర్సెస్ విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విద్యార్థులకు వసతి గృహాల్లో సదస్సులు ఏర్పాటు చేసి యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు.

పరీక్షా కేంద్రాలు తనిఖీ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 8 : ఏయూ దూరవిద్యా కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న ఎంబీఏ, ఎంసీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ మూడవ సెమిస్టర్ పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ గురువారం పరిశీలించారు. ఏయూ ఐఏఎస్ఈ భవనంలో జరుగుతున్న కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో, పటిష్ట విధానంలో పరీక్షలు నిర్వహించడం పట్ల అధికారులను అభినందించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

చెత్త డంపర్ తొలగించక ఇబ్బందులు



పీహెచ్‌సీ సమీపంలో ఏర్పాటు చేసిన డంపర్

మధురవాడ, ఫిబ్రవరి 8 : జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ పీహెచ్‌సీ సమీపంలో ఉన్న చెత్త డంపర్ వల్ల స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మధురవాడ మార్కెట్ దారిలో ఉన్న డంపర్‌లో ప్రతిరోజూ టన్నుల కొద్ది చెత్త వేస్తారు. దీనివల్ల పీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చేవారితో పాటు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. రెండేళ్ల నుంచి డంపర్ ఇక్కడే ఉందని, పలుమార్లు జీవీఎంసీ పారిశుధ్యం పర్యవేక్షిస్తున్న అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి డంపర్‌ను పీహెచ్‌సీకి దూరంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పద్మనాభంలో దట్టంగా పొగమంచు



మద్దిలో ఉదయం 8 గంటలకు మంచు

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 8 : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వేకువజామున దట్టమైన పొగమంచు కురిసింది. ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు తొలగకపోవడంతో వాహనదారు లు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు.అలాగే ఉదయం పొలాలకు వెళ్లే రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు మంచు వల్ల ఇబ్బందులు పడ్డారు. కాగా పొగమంచు వల్ల మామిడి, జీడి, అపరాల పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

హిందీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు పొందిన విద్యార్థులు

పద్మనాభం,ఫిబ్రవరి 8 : పొట్నూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు హిందీ ప్రతిభా పరీక్షల్లో పతకాలు సాధించారు. కడప జిల్లాలోని ప్రొద్దుటూరుకు చెందిన దశమండం విద్యా సేవా సదన్ హిందీ భాష ప్రచారంలో భాగంగా ఈ పోటీలు జరపగా ఆరు నుంచి ఎనిమిదవ తరగతి వరకు చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులు పురస్కారాలు పొందారు.

సైన్స్ పట్ల ఆసక్తి చూపాలి

కొమ్మాది, ఫిబ్రవరి 8 : విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి చూపాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి. మురళీకృష్ణ అన్నారు. సైన్స్ కళాయాత్ర బస్సు గురువారం చంద్రంపాలెం హైస్కూల్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు రమణమూర్తి, కామేశ్వరరావు, శేషగిరిరావు, హెచ్ఎం రాజాబాబు, పాల్గొన్నారు.



సందీప్ పాదయాత్ర ముగింపు సభలో మాట్లాడుతున్న కొణతాల

జగన్ పాలనలో అన్ని వర్గాలకు ఇబ్బందులు

- జనసేన నాయకుడు కొణతాల రామకృష్ణ

సింహాచలం, ఫిబ్రవరి 8 : వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని మాజీ మంత్రి, జనసేన నేత కొణతాల రామకృష్ణ అన్నారు. జనసేన భీమిలి అసెంబ్లీ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ చేపట్టిన పాదయాత్ర ముగింపు సభ గురువారం రాత్రి 98వ వార్డు సింహాచలం ప్రధాన కూడలిలో జరిగింది. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఎక్కడ చూసినా హత్యలు, అత్యాచారాలు, కిడ్నాప్‌లు, భూదందాలు జరుగుతున్నాయన్నారు. జగన్ రాష్ట్రాన్ని నాలుగు భాగాలుగా విభజించి పాలన సాగిస్తున్నారని, వైసీపీ అరాచక పాలనకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పంచకర్ల సందీప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణయ్య, బొడ్డేపల్లి గాంధీరామ్, పాశర్ల ప్రసాద్, సతివాడ శంకరరావు, కార్పొరేటర్ నరసింహం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

యునాని వైద్యంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 8 : పట్టణంలోని నెహ్రూ రోడ్డులో వున్న జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులకు యునాని వైద్యంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ యునాని ఆస్పత్రి వైద్యు రాలు బి.ప్రతిభ మాట్లాడుతూ అన్ని రోగాలకు యునాని ఔషధాలు వున్నాయన్నారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వున్న యునాని విభాగంలో ఈ మందులు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. కొన్ని వేల సంవత్సరాల క్రితం నాటి ప్రాచీన యునాని వైద్యంపై ఇపుడు కొత్తగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. గతకొంత కాలంగా ఈ వైద్యం మన దేశంలో ప్రాచుర్యం పొందుతుందన్నారు. అనంతరం విద్యార్థులను పలు పరీక్షలు నిర్వహించి, ఔషధాలు అందించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వై. మీనాక్షి, సత్యవతి, పాఠశాల హెచ్ఎం సీహెచ్ సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు : కోరాడ



క్రీడాకారులతో టీడీపీ నాయకుడు రాజబాబు

ఆనందపురం, ఫిబ్రవరి 8 : విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చునని టీడీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి కోరాడ రాజబాబు అన్నారు. గురువారం ఆయన పెద్దిపాలెంలో పార్టీ నాయకుడు దివంగత మరుపిళ్ల బాబ్జి 59వ జయంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలను విడనాడి సన్మార్గంలో పయనించాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తేనే ఉన్నత శిఖరాలను అందుకోవచ్చునన్నారు. నిర్వాహకుడు మరుపిళ్ల సాయి మాట్లాడుతూ టోర్నమెంట్‌లో 50 జట్లు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మీసాల సత్యన్నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మరుపిళ్ల చిన్నయ్యపాత్రుడు, నాయకుడు బొద్దపు దేముడు,లొడగల వెంకటరావు, పడాల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి మంది రోగులకు వైద్య పరీక్షలు



రోగులకు మందులు అందజేస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 8 : హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో ఎన్టీఆర్ సేవా ట్రస్టు, గీతం ఆస్పత్రి సంయుక్తంగా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు వెయ్యి మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ 15, 16 వార్డుల అధ్యక్షులు బుగత సత్యనారాయణ, నారు గోపి మాట్లాడుతూ వార్డుల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముగడ వాసు, మళ్ల రవికుమార్, పల్లా ఉమారాణి, బంగార్రాజు, సీహెచ్ గోవింద్, మొల్లి శంకర్, జి. అప్పన్న, శ్రీను, కె. మహేష్, కర్రి గౌరీ, వరలక్ష్మి, సోని, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 8 : విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా అవకాశాలను పొందవచ్చునని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఫార్మసీ, పీజీ డిప్లొమా కళాశాల విద్యార్థుల వీడ్కోలు సభలో మాట్లాడారు. ప్రతి విద్యార్థి టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, ప్రాక్టికల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటివి అభివృద్ధి చేసుకోవాల న్నారు. మత్తు పదార్థాలు, ర్యాగింగ్, కొట్లాటలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



1వ వార్డులో డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తగరపువలస, ఫిబ్రవరి 8 : జీవీఎంసీ 1వ వార్డులో రూ.1.7 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాజీనగర్, రాజావీధి, శారదా స్కూల్ ప్రాంతాల్లో పనులు చేప డతామన్నారు. ఇంతవరకు వార్డులో రూ.1.32 కోట్లతో వివిధ పనులు చేశామని, 1,600 మందికి కాలనీ ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు నాయకులు, సచివాలయ సిబ్బంది, వార్డు కన్వీనర్లు పాల్గొన్నారు.

జమ్మి చెరువు ఆవరణలో కళా వేదిక

భీమునిపట్నం, : పట్టణంలోని జమ్మి చెరువు ఆవరణలో కళా వేదిక ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి ఆయన రూ.18.05 లక్షలతో జమ్మి చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన 44 మోడరన్ లైటింగ్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, వైసీపీ యువజన విభాగం కోఆర్డినేటర్ ముత్తంశెట్టి శివ నందీష్, అల్లిపిల్లి నరసింగరావు, 2వ వార్డు ఇన్‌ఛార్జి కరుణాకర్‌రెడ్డి, నాయకులు మొకర నరసింగరావు, అనపర్తి సూర్య ప్రకాశరావు, కోండ్రు సూరప్పడు, జడ్సీ శైలజవల్లీ, ఏఈ సుమన్, తదితరులు పాల్గొన్నారు.